నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ మంగళవారం 9-3-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 184 పేజీలు: 4 వెల: రూ.1/-

తెలంగాణ ఉద్యమకారుడు కొల్లూరి చిరంజీవి కన్నుమూత

-సంతాపం తెలిపిన సిఎం కెసిఆర్, మంత్రులు

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ కొల్లూరి చిరంజీవి (74) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చిరంజీవి గచ్చిబౌలిలోని ఎఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో చిరంజీవి చురుకుగా పాల్గొన్నారు. చిరంజీవి మృతిపై సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, హరీశ్ రావు, ఈటల, ఎంఎల్ సి కల్వకుంట్ల కవితతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. చిరంజీవి వైద్యానికి అయ్యే ఖర్చును ఆయన కుటుంబం భరించలేని పరిస్థితుల్లో ఉందని తెలుసుకున్న మంత్రి కెటిఆర్ సిఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. ఈ మొత్తాన్ని మంత్రి ఈటల రాజేందర్ ఆసుపత్రికి వెళ్లి ఆయన కుటుంబానికి అందించారు. తెలంగాణ తొలి తరం ఉద్యమకారుడు డాక్టర్ కొల్లూరి చిరంజీవి మృతి పట్ల సీఎం శ్రీ కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. డాక్టర్‌గా ఉన్నత చదువులు చదివి సమాజం కోసం బతికిన చిరంజీవి జీవితం ఆదర్శనీ యమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. డాక్టర్ కొల్లూరి చిరంజీవి మృతి తెలంగాణకు తీరని లోటు అని ఆర్థిక మంత్రి హరీష్ రావు అన్నారు. కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థిగా ఉన్న సమయంలో,విద్యార్థులందరినీ కూడగట్టి 1969 ఉద్యమంలో చిరంజీవి కీలక పాత్ర పోషించారని మంత్రి పేర్కొన్నారు.

భైంసాలో పరిస్థితి అదుపులోనే ఉంది : హోంమంత్రి

నిర్మల్, మార్చి 8: భైంసా పట్టణంలో పరిస్థితి అదుపులోనే ఉందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. ఘర్షణలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తున్నామని పేర్కొన్నారు. అల్లరిమూకల ఆటకట్టించేందుకు అవసరమైనంత భద్రతా దళాలను మోహరించినట్లు చెప్పారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆదివారం రాత్రే డిజీపీ మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పరిస్థితిపై సమీక్షించినట్లు హోంమంత్రి వెల్లడించారు. శాంతిభద్రత విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

భైంసా పట్టణంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న గొడవ.. ఘర్షణకు దారితీయడంతో పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. జుల్ఫేకార్‌గల్లీ, కుభీరు రహదారి, గణేశ్‌నగర్, మేదరిగల్లీతోపాటు బస్టాండు ప్రాంతాల్లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు అల్లరిమూకలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుండగా కొందరు వాహనాలు, దుకాణాలకు నిప్పంటించడంతో అవి దహనమయ్యాయి. ఈ ఘర్షణల్లో చిన్నారులు, మహిళలు, ఓ ఎస్సై, కానిస్టేబుల్‌తోపాటుగా ఇద్దరు ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బంది గాయపడ్డారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పువ్వాడ

ఖమ్మం,మార్చి8(ఆర్ఎన్ఎ): మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు సీఎం కేసీఆర్ నాయకత్వం తెలంగాణ ప్రభుత్వం అనేక ఆదర్శనీయ నిర్ణయాలు తీసుకుందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

పురుషులతో పోటీ పడి అన్నిరంగాల్లో ముందుంటున్న మహిళలకు అన్ని సదుపాయాలను కల్పిస్తూ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని అన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళ సోదరీమణులకు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు ..

ఈ సందర్భంగా తెరాస ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సమాజ వికాసానికి నిజమైన కొలమానం.. ఆ సమాజంలోని మహిళాభివృద్ధి స్థాయి మాత్రమేనని అంబేద్కర్ మహాశయుడు చెప్పారని, ఆయన మాటలు మననం చేసుకుంటు మహిళల వికాసానికి, భద్రతతకు, వారి .తొలి సారీ మహిళ కార్పోరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కూడా సీఎం కేసీఆర్ గారిదేన్నారు.. మహిళలకు కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాం అని, కల్యాణ లక్ష్మి , షాది ముబారక్, ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులకు, బాలింతలకు, శిశువులులకు ప్రతి రోజు పాలు, గుడ్లతో కూడిన పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తున్నది.

గర్భిణి స్త్రీలు ఆస్పత్రులకు వచ్చిపోడానికి అమ్మఒడి వాహనాల ద్వారా ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించడమైందన్నారు. కేసీఆర్ కిట్స్ తో గర్భిణులకు ఆర్థికంగా సాయం అందిస్తు, ప్రస్తుతం దేశంలో ఎక్కడాలేని విధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, పోలీస్ ఉద్యోగ నియామకాల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తోన్న ఏకైక రాష్ట్రం తెలంగాణెళి అని వివరించారు. అలాగే, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు నెలనెలా రూ.2,016 పెన్షన్ అందజేస్తున్నాం.

ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినుల కోసం 53 డిగ్రీ గురుకుల కాలేజీలను ప్రారంభించి ఆడపిల్లలకు హెల్త్, హైజీన్ కిట్స్ లను ప్రభుత్వం అందిస్తున్నదని అన్నారు.

కార్యక్రమంలో కార్యాలయ ఇంచార్జి బాణోత్ చంద్రావతి , కార్పొరేటర్లు నీలం జయమ్మ , ఊటూర్రు లక్ష్మి సుజాత , కొత్తపల్లి నీరజ దొరేపల్లి శ్వేత , మహిళ నాయకురాలు కొల్లు పద్మ కీసర పద్మజ రెడ్డి , కొంగర జ్యోతిర్మయి తన్నీరు శోభారాణి , కొనకంచి సరళ షకీనా, స్వరూపరాణి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు దేశ ప్రముఖుల శుభాకాంక్షలు

రాష్ట్రపతి,ప్రధాని, సిఎంల అభినందనలు

న్యూఢిల్లీ,మార్చి8(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. దేశ మహిళలందరికీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మహిళలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ' దేశంలోని మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. మనదేశంలో మహిళలు విభిన్న రంగాల్లో విజయ పరంపర కొనసాగిస్తూ.. రికార్డులు సృష్టిస్తున్నారు. స్త్రీ, పురుష అసమానతల్ని నివారించడానికి మనందరం సమిష్టిగా కృషి చేయాలి' అని సోమవారం రాష్ట్రపతి ట్విటర్‌లో పోస్టు చేశారు. మహిళలందరికీ ప్రధాని మోడి శుభాకాంక్షలు తెలిపారు. 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నారీమణులకు వందనం. మహిళలు సాధిస్తున్న విజయాల పట్ల దేశం గర్విస్తోంది. అనేక రంగాల్లో మహిళా సాధికారత దిశగా పనిచేసే అవకాశం లభించడం మా ప్రభుత్వానికి ఎంతో గౌరవం' అని మోడి ట్వీట్ చేశారు. మహిళా సాధికారత సాధనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. తమ ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందని ఆయన తెల్పిచెప్పారు. మహిళలు సాధించిన విజయాలు దేశానికే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. జనాభాలో సగభాగమైన మహిళలు పురుషులకు ధీటుగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలకు ఎపి సిఎం జగన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని జగన్ కొనియాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. మహిళలకు తెలంగాణ గవర్నర్ తమిళిసై శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ సాధనకు మహిళా సాధికారత చాలా కీలకమన్నారు. మహిళ అభివృద్ధే కుటుంబ అభివృద్ధి అని తెలిపారు. కోవిడ్ సమయంలో వివిధ రంగాల్లో మహిళలు చేసిన సేవలను కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె కాంక్షించారు. మహిళల విజయాలు అందరికీ స్ఫూర్తిస్తున్నారు అని పేర్కొన్నారు. కరోనా సమయంలో త్యాగం, సాహసంతో వ్యవహరించారు అని గవర్నర్ కొనియాడారు. మహిళా లోకానికి సిఎం కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పాలనలో, అభివృద్ధిలోనూ అతివలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మహిళా సాధికారతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సమస్యలు ఎన్ని ఎదురైనా వాటిని ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. హైదరాబాద్ నగర మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి సత్యవతికి కరోనా పాజిటివ్

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కరోనా బారిన పడ్డారు. సోమవారం ఉదయం ఆమెకు నిర్వహించిన కరోనా పరీక్షల్లో పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో వైద్యుల సూచన మేరకు ఆమె హోం ఐసోలేషన్‌లో ఉంటున్నట్టు ప్రకటించారు. గత నాలుగు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న మంత్రి సత్యవతికి ఇవాళ కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇటీవల తనను కలిసిన వారంతా కరోనా టెస్టులు చేయించుకోవాలని మంత్రి సూచించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరోనా వెల్లడి కావడంతో ఆమె అనుయాయులు ఆందోళన చెందారు.

మహిళలు చేసిన వస్తువులు కొన్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి, 8: ప్రపంచ మహిళా దినోత్సవం నాడు వివిధ రంగాల్లో మహిళలు చేసిన వస్తువులను కొనుగోలు చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. అస్సాం మహిళలు చేసిన గముచా, నాగాలాండ్ నుంచి షాల్, గోండ్ పేపర్ పెయింటింగ్‌లను కొన్నట్లు ఆయన తన ట్విటర్‌తో ద్వారా వెల్లడించారు. మహిళల వ్యాపారాలు, సృజనాత్మకత, భారతదేశ సంస్కృతిని సెలబ్రేట్ చేసే ఉద్దేశంతో ఈ వస్తువులు కొన్నట్లు మోదీ చెప్పారు. ఆత్మనిర్భర్‌గా మారేందుకు ఇండియా చేస్తున్న ప్రయత్నంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి నిబద్ధులమవుదాం. ఇవాళ నేను మహిళా పారిశ్రామికవేత్తలు చేసిన కొన్ని ఉత్పత్తులను కొనుగోలు చేశాను అని మోదీ ట్వీట్ చేశారు.

ప్రతి రంగంలో మహిళలకు ప్రాధాన్యత

ప్రతిరంగంలోనూ ప్రాధాన్యం దక్కాలన్న కవిత

తెలంగాణలో మహిళలకు తగు ప్రాధాన్యం దక్కలేదన్న షర్మిల

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): రాష్ట్రవ్యాప్తంగా మహిళా దినోత్సవ వేడుకలు పలుచోట్ల ఘనంగా జరిగాయి. పలు కార్యక్రమాల్లో ప్రముఖులు పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు రకరకాలుగా వివక్షకు గురవుతున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఏడాది పొడవునా, ప్రతి రంగంలో మహిళలకు ప్రాధాన్యత దక్కాలన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో దళిత్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(డిక్కీ) ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్థిక స్వావలంబనతో మహిళలకు నిర్ణయాధికారం పెరుగుతుందని కవిత అన్నారు. టీ - ప్రైడ్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం దళిత మహిళలు పారిశ్రామికంగా ఎదిగేందుకు ఆర్థిక చేయూతనిస్తుందని ఆమె తెలిపారు. డిక్కీ అనేక మంది దళిత పారిశ్రామికవేత్తలను తయారు చేస్తోందన్నారు. దళిత మహిళలపై కుల వివక్ష సైతం ఉందని కవిత పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ప్రతి విషయంలో సమాజానికి ఆదర్శంగా నిలిచారు అని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. టీ ప్రైడ్ ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలకు 45 శాతం మేరా సబ్సిడీని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. వీటితోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు డిక్కీ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

ఇకపోతే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. మహిళలు ప్రకృతి, శక్తికి ప్రతిరూపాలని, వారిని పూజించే సంప్రదాయం మనకు అనాదిగా వస్తున్నదని వెల్లడించారు. అనమాన ప్రతిభ వారి సొంతమని పేర్కొన్నారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నదని చెప్పారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం నందర్భంగా మహిళలకు సెలవు ప్రకటించిందని, చట్ట సభల్లో మహిళలకు సమానత్వం కల్పించాలనే ఉద్దేశంతో స్థానిక సంస్థల్లో, మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు కల్పించిందని వెల్లడించారు. మహిళలపై తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న గౌరవానికి ఇదే నిదర్శనమన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా లోటస్ పాండ్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో మహిళ ప్రాతినిధ్యం గురించి షర్మిల మాట్లాడారు. తెలంగాణ సమాజంలో మహిళల ప్రాతినిధ్యం ఎంతో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ గడ్డ రాజకీయ చైతన్యానికి అడ్డా అని, ఇక్కడి మహిళలు ఎవరికీ తక్కువ కాదని చెప్పారు. రాణి రుద్రమదేవి చరిత్ర అందరికీ తెలుసన్నారు. ఉద్యమాల్లో మహిళలది కీలక పాత్ర అని, కానీ ప్రస్తుత తెలంగాణ సమాజంలో స్త్రీల ప్రాతినిధ్యం ఎంత అని ప్రశ్నించారు. అసమానతలు గెలిచి సాధించుకున్న రాష్ట్రంలో అసమానతలు ఉన్నాయని షర్మిల ఆరోపించారు. పోరాటం చేసి సాధించుకున్న రాష్ట్రంలో మహిళలకు అన్యాయం జరుగుతోందని, ప్రత్యేక రాష్ట్రంలో మహిళలు ఘోరంగా అన్యాయమయ్యారని షర్మిల అభిప్రాయపడ్డారు. మహిళల విషయంలో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎంతో మంది మహిళలు మంత్రి పదవులు అలంకరించారని, ప్రత్యేక రాష్ట్రంలో ఐదేళ్ల తర్వాత అది కూడా ఇద్దరికే అవకాశం ఇచ్చారని షర్మిల ఎద్దేవా చేశారు. మహిళలు అన్నింటిలోనూ సగం అయినప్పుడు ఇలాంటి అసమానతలు ఎందుకో పాలకులు చెప్పాలని డిమాండ్ చేశారు. చట్ట సభల దగ్గర నుంచి ఉద్యోగాల వరకు మహిళలకు అన్యాయం జరుగుతోందన్నారు. మహిళలకు అన్నింటా నిర్దిష్ట కోటా ఉండాల్సిందేనని షర్మిల స్పష్టం చేశారు. మహిళల హక్కుల కోసం తాను నిలబడతానని చెప్పారు. నేటి నుంచి తాను చేయబోయే ప్రతి పనిలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తానని చెల్లిగా, అక్కగా మాటిస్తున్నానని హామీ ఇచ్చారు.

ప్రశ్నించే గొంతా..పరిష్కరించే గొంతా

నిరుద్యోగ యువత ఆలోచించాలి

కేంద్రం ఉన్న సంస్థలను తెగనమ్ముతోంది జాగ్రత్త

-ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మంత్రులు

మహబూబ్‌నగర్,మార్చి8(ఆర్ఎన్ఎ): నిరుద్యోగులు ఆలోచించాలి.. కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు.. లాభాల బాటలో ఉన్న కంపెనీలను కేంద్ర ప్రభుత్వం అమ్మేసి.. ఉద్యోగాలకు గండి పెడుతున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లాలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతు కావాలా.. పరిష్కరించే గొంతు కావాలా ఆలోచించాలని తెలిపారు. ఆరేళ్లు ఏమి ప్రశ్నించి.. ఏమి సాధించారో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రరావు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వకీలుగా.. తోటి వకీల్లే ఆయనను నమ్మడం లేదని ఎద్దేవా చేశారు. సొంత ప్రొఫెషన్ వారికే న్యాయం చెయని వ్యక్తి.. ఇతరులకి ఏమి న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్నాడు.. మరీ ఇచ్చారా అని నిలదీశారు. ఇది మన భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికలు.. కుల.. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నిస్తున్న పార్టీలకు తెలంగాణలో స్థానం లేదన్నారు. ఉద్యోగులకి రిటైర్మెంట్ వయస్సు పెంచుతామన్నారు. ఉద్యోగులు సంతృప్తి చెందే విధంగా తాము చేస్తాం.. మరీ.. వాళ్లు గెలిస్తే ఇవి చేయగలరా అని బీజేపీ నాయకులను ప్రశ్నించారు.రామచంద్రరావు ఇప్పటికైనా సీపీఎస్ రద్దు చేయిస్తానని ప్రకటన చేయాలని నిలదీశారు. మీరు వ్యాపారంలా ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. తాము ప్రధానమంత్రి నరేంద్రమోదీని గౌరవిస్తాం.. మాకు సభ్యత సంస్కారం.. ఉంది.. కానీ బీజేపీ నాయకులకు సంస్కారం లేదని ధ్వజమెత్తారు. ఇది అందరూ గమనిస్తున్నారు. కరెంటు విషయంలో సాధించిన ప్రగతి.. దేశంలో ఎక్కడా లేదని తెలిపారు. తెలంగాణా వచ్చిన రెండేళ్లలోనే.. రైతులకు 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తున్నాం. పరిశ్రమలకు సబ్సిడీపై కరెంటు ఇస్తున్నాం. ఇలాంటి ఏ స్కీములు కూడా పక్క రాష్ట్రాల్లో ఎక్కడా లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి తాము చూస్తుంటే.. బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు నచ్చడం లేదని మండిపడ్డారు. వచ్చే పదేళ్లు టీఆర్ఎస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వాణీదేవి.. మన జిల్లా వాసి.. మన జిల్లా వాసికి ఓటు వేయాల్సిన భాధ్యత మనదని తెలిపారు. ఉమ్మడి జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

మహిళల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి అల్లోల

నిర్మల్, మార్చి8: మహిళల సమగ్రాభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం దివ్యా గార్డెన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషులతో పోటీ పడి అన్ని రంగాల్లో ముందుంటున్న మహిళలకు అన్ని సదుపాయాలను కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులకు, బాలింతలకు, శిశువులులకు ప్రతి రోజు పాలు, గుడ్లతో కూడిన పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తున్నదని పేర్కొన్నారు. గర్భిణులు దవాఖానలకు వచ్చిపోవడానికి అమ్మఒడి వాహనాల ద్వారా ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు.

కేసీఆర్ కిట్స్ తో గర్భిణులకు ఆర్థికంగా సాయం అందిస్తున్నామని, అలాగే ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు నెలనెలా రూ.2,016 పెన్షన్ అందజేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినుల కోసం డిగ్రీ గురుకుల కాలేజీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆడపిల్లలకు హెల్త్, హైజీన్ కిట్స్ లను ప్రభుత్వం అందిస్తున్నదని మంత్రి తెలిపారు.

ఒక రోజు హోంమంత్రిగా మహిళా కానిస్టేబుల్..

భోపాల్, మార్చి, 8: : అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మధ్యప్రదేశ్ మహిళా కానిస్టేబుల్‌కు అరుదైన గౌరవం లభించింది. కానిస్టేబుల్ మీనాక్షి వర్మ ఒక రోజు హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి నరోత్తమ్ మిశ్రా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన చైర్‌ను ఓ రోజు పాటు కానిస్టేబుల్ మీనాక్షి వర్మకు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు మధ్యప్రదేశ్ ప్రభుత్వం మతమార్పుడులను వ్యతిరేకిస్తూ చేసిన చట్టానికి ఇవాళ అసెంబ్లీలో ఆమోదం దక్కింది.

"రైతు జీవితం" అంశంపై కవితలకు ఆహ్వానం..



రైతే రాజన్నారు
రైతే దేశానికి వెన్నెముక అన్నారు
రైతు లేనిదే దేశానికి ప్రగతి లేదన్నారు
రైతే అన్నదాత అన్నారు
తినే ప్రతి గింజమీద మనపేరు ఉంటుందని
అలాంటి ప్రతి గింజను పండించే రైతే
పరబ్రహ్మ స్వరూపం అన్నారు
మరి ఈ రోజు రైతు పరిస్థితి ఏమిటి?
ఎండనక, వాననక
నడిరోడ్డుపై నిస్సహాయంగా చూసే పరిస్థితి
ఈరోజు ఎందుకొచ్చింది?
నేలతల్లిని నమ్ముకున్న రైతుకు
పోరాటం ఎందుకు చేయాల్సి వస్తోంది?

మీ కలాలు ఇచ్చే సమాధానం ఏమిటి?

పాతిక వాక్యాలు మించకుండా
రైతు సమస్య పరిష్కార దిశగా
కలాలను కదిలించండి..

'నేటినిజం' దినపత్రిక,
ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20
లేదా E-mail : netinizam2020@gmail.com
పేజీమేకర్ ఓపెన్‌ఫైల్, అనుస్క్రిప్ట్-7లో డిటిపి చేసి మెయిల్ చేయండి..

ఉత్తమమైన కవితలతో 'నేటినిజం' ప్రత్యేక సంచికను వెలువరిస్తుంది. వెంటనే మీ రచనలు పంపగలరు.

కం॥ "సాంతి సోరాబ్జీ పై
శూలకీ దయ గలిగి న్యాయ శోధన లోనన్
త్రాలగ అరిచి తిట్టెను
పాలకులను, పాలితులను వందనములిడునన్ !!

(మార్చి 9 న్యాయవేఉత్త సోలీసోరాబ్జీ జయంతి...)

-రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

పార్లమెంటులో మహిళాబిల్లుపై చర్చేదీ ?

నేటినిజం
మంగళవారం 9-3-2021

పార్లమెంట్ సమావేశాలు రెండో విడత మొదలైన రోజే అంతర్జాతీయ మహిళా దినోత్సవం రావడం..ఆ అంశంపై పలువరు మహిళా ఎంపిలు మహిళా బిల్లుపై ప్రస్తావించడం జరిగింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోడీ తదితర ప్రముఖులు కూడా మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నోరు తెరిచి పార్లమెంటులో మహిళా బిల్లు కోసం గళమెత్తినా ఏ ఒక్కరే కూడా దీనినై దృష్టి పెడతామని చెప్పలేదు. వారిపట్ల ఎంతమాత్రం ప్రేమ ఉందో మోడీ తదితరుఉల మరోమారు నిరూపించుకున్నారు. నిజంగానే చిత్తశుద్ధి ఉంటివుంటే తొలిరోజు మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా బిల్లుపై చర్చించేవారు. అలాచేసివుంటే బాగుండేది. కనీసం వారి అభిప్రాయాలకు విలువను ఇచ్చినట్లుగా ఉండేది. కానీ అల జరగలేదు. కేవలం వారికి శుభాకాంక్షలు చెప్పడంతో బడానేతలు తప్పించుకున్నారు. తమ ధర్మాన్ని విస్మరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఇలా లు ఏటా జరుపుకుంటున్నా,,, మన నేతల్లో మార్పు రావడం లేదు. చట్టసభల్లో వారికి రావాల్సిన వాటాను కావాలనే అడ్డుకుంటున్నారు. సమాజంలో మహిళలకు ఉన్న అత్యుతన్నస్థాయి గౌరవాన్ని మనమే దిగజార్చుకుంటున్నా పెద్దగా భయపడడం లేదు. సాజం కూడా వారిని ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నది.. అమ్మాయి కనిపిస్తే రేప్ చేయడమే లక్ష్యంగా మృగాళ్లు చెలరేగి పోతున్నారు. అందుకే చట్టసభల్లో వారికి గౌరవం ఇచ్చేలా రిజర్వేషన్ బిల్లును తేలేక పోయాం. ఈ పరిస్థితులపై మనమంతా మహిళల హక్కులపై చర్చించాలి. వారి గౌరవానికి భంగం కలిగించే అంశాలపై యుద్ధం చేయాలి. అనేకానేక అవరోధాల మధ్య కూడా తమతమ రంగాలలో శక్తిమంతమైన మహిళగా ఆమె నిరూపించుకుంటూనే ఉంది. వ్యక్తిత్వ హననం జరుగుతున్నా.. సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. మహిళా భ్యుదయమే దేశాభ్యుదయం అని మనమంతా కీర్తిస్తూ వారిని మభ్యపెడుతున్నామని గుర్తించాలి. మహిళా సమానత్వమే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందనడంలో సదేహం లేదు. ఇక దీనిని సవాల్‌గా తీసుకుని మహిళలే తమ హక్కుల కోసం పోరాడాలని గుర్తుంచుకోవాలి. పురుషాహంకార సమాజాన్ని నిలదీయాలి. నిగ్గదీయాలి. తమ హక్కులను సాధించే వరకు పోరాన్ని కొనసాగించాలి. ఇక కారణాలు చెప్పుకోవడానికి ఏమీ లేదు. ఎవరి కారణంగా మహిళా బిల్లు ఆగిపోయిందనడానికి లేదు. మోడీ ప్రభుత్వానికి సంపూర్ణ బలమున్నది. ఈ బడ్జెట్ సమేశాల్లో దీనిపై చ్చ చేయడం ద్వారా తన చిత్తవుద్దిని చాటుకోవాలి. అన్నింటికి మించి ప్రధాన ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ పార్టీ బేషరతుగా చర్చకు పూనుకోవాలి. ఈ మహిళా దినోత్సవ కానుకగా అయినా ప్రధాని మోడీ ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చిత్తశుద్ధితో బిల్లును గట్టెక్కించే బాధ్యతను తీసుకుంటే మహిళాలోకం హర్షిస్తుంది. గతంలో లాగా కారాణలు లేదా సాకులు చూపే సమయమిది కాదు. అలా చేస్తే ఇక బిజెపిని పూర్తిగా నమ్మరు. ఆరేళ్లుగా దీనిపై మాటమాత్రంగా అయినా మాట్లాడకుండా నెట్టుకొస్తున్న ప్రధాని మోడీ ఇక ఏ మాత్రం జాప్యం చేయకుండా ఈ సమావేశాల్లోనే బిల్లు పెట్టి పాస్ చేయించే బాధ్యత తీసుకోవడం ద్వారా భారతీయ మహిళలకు భరోసా కల్పించాలి. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా గత రెండున్నర దశాబ్దాలుగా మహిళా బిల్లు మాత్రం గట్టెక్కలేక పోతోంది. లోక్‌సభలో సంపూర్ణ మెజార్టీ ఉన్నా మోడీ ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకుని వచ్చే ప్రయత్నం చేయడం లేదు. అనేక సదస్సులు,సమావేశాల్లో ప్రధాని మోడీ మహిళల ఔన్నత్యం గురించి మాట్లాడుతున్నా పార్లమెంటులో మాత్రం బిల్లు రావడం లేదు. మహిళా దినోత్సవం రోజునే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మలివిడత మొదలయినా చట్టసభల్లో ఈ అంశాన్ని చర్చిద్దామన్న భావన వారికి కలగలేదు. కేవలం తమ రాజకీయ పబ్బం గడుపుకునే అంశాలతోనే గొడవలకు దిగడం తప్ప విపక్షాలకు కూడా మహిళా బిల్లుపై చిత్తశుద్ధి లేదని తేలిపోయింది. మహిళల రిజర్వేషన్లపై ముందుకు సాగుతారన్న ఆకాంక్ష ఇక కలగానే మిగిలిపోనుంది. పాలనలో వారికి భాగస్వామ్యం కల్పించ కుండా వారిని అణగదొక్కే కుట్రల్లో బిజెపి కూడా ముందే ఉంది. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగదొక్కుతున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కారణంగా ఎందరో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. కానీ అసెంబ్లీ , పార్లమెంటుల్లో మాత్రం రిజర్వేషన్ల ద్వారా అవకాశాలు దక్కడం లేదు. ఇలా వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారు అవుతున్నారు. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. చట్టసభల్లో మూడోవంతు రిజర్వేషన్లు ఎవరి దయాధర్మంగానో కాకుండా హుక్కుగా, సగౌరవంగా లభించాల్సి ఉంది. మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించినప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుంది. ఏకాభిప్రాయ సాధన, ఉపకోటా పేరిట ఇంతకాలం రాజకీయం చేస్తూ వచ్చారు. మహిళాబిల్లుకు మద్దతు పలికే పార్టీల్ని కూడగట్టే యత్నాలను చేయాలి. మహిళల హక్కుల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోకుండా చూడాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికారపక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి.మహిళల గొప్పతనాన్ని భారీతీయ మహిళల ఆదర్శాలను ప్రముఖంగా ప్రస్తావించిన ప్రధాని ఈ సారయినా మహిళా బిల్లుకు మోక్షం కలిగించాలి.

మహిళా నాయకతవ&మే ఈ యేడాది థీమ్ !

న్యూఢిల్లీ,మార్చి8(ఆర్ఎన్ఎ): యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా ....అన్న ఆర్యోక్తిని మననం చేసుకోవడం నిరంతరంగా సాగాలి. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు పూజలందుకొంటారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడరో అక్కడ ఎంత గొప్ప సత్కార్యాలైననూ ఫలించవు అని మనుస్మృతి తెలుపుతుంది. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో, ఎక్కడ స్త్రీలను దేవతగా భావించి పూజిస్తారో, అక్కడ సర్వసంపదలూ ఉండడమేకాక రథ, గజ, తురగ పదాదులతో కూడిన లక్ష్మీ దేవి అచంచలయై నిలబడుతుంది. 1975వ సంవత్సరం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా నిర్వహించటం ప్రారంభించింది. అంతేకాదు, ప్రతి ఏటా ఏదో ఒక ఇతివృత్తం అంటే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 'గతాన్ని వేడుక చేసుకోవడం, భవిష్యత్తుకు ప్రణాళికలు రచించుకోవడం' అని మొదటి థీమ్‌ను నిర్ణయించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2021 థీమ్ : ఈ ఏడాది ప్రపంచాన్ని కరోనా మహమ్మారి చుట్టేసిన నేపథ్యంలో భవిష్యత్ లో ముందుకు వెళ్ళడానికి మహిళలకు నాయకత్వం ఇవ్వాలనే ఇతి వృత్తిని ఎంచుకుని ఓ ప్రణాళిక రచించింది. కోవిడ-19 కల్లోలం నుంచి భవిష్యత్తులో అభివృద్ధి చేయడానికి.. విధాన రూపకల్పనకు సంబంధించి నిర్ణయం తీసుకునే పక్రియలో మహిళలను సమాన భాగస్వాములుగా ఎలా చేయవచ్చో థీమ్ హైలైట్ చేస్తుంది. కరోనా సృష్టించిన ఆర్థిక కల్లోలం నుంచి భవిష్యత్ వైపు అడుగులు వేయాలంటే మహిళలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. విప్లవాత్మక మార్పుల కోసం అడుగు వేయాలని తెలిపింది. మహిళల పురోగతిని నిరోధించే సాంస్కృతిక, చారిత్రక, సామాజిక-ఆర్థిక అవరోధాల అడ్డును తొలగించాలనేది ఈ థీమ్ ముఖ్య ఉద్దేశ్యం.

పసుపు రైతుల ఆందోళనలను పట్టించుకోరా?

-గిట్టుబాటు ధరల కోసం పసుపు రైతు పోరు

నిజామాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ పసుపు మార్కెట్‌పై వ్యవహారం ఎటూ తేలకపోవడం, పసుపు బోర్డుకు బదులు స్పైసెస్ బోర్డు ప్రకటించినా అది తేలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిజామాబాద్ జిల్లాతోపాటు జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి వేల పసుపు బస్తాలను తీసుకొస్తున్న రైతుల సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారు. మద్దతు ధర, ఇతర సమస్యను తీర్చేవారే కరువయ్యారు. పసుపు రైతులను ఏళ్ల తరబడి ఎన్నికలకు అస్త్రాలుగా వాడుకొని లబ్ధి పొందిన నేతలు పసుపు ధరపై పట్టించుకోవడం లేదు. దీంతో ఇటీవల మద్దతు ధరల కోసం జగిత్యాలలో పసుపు రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. నిజామాబాద్ మార్కెట్ లో పసుపు ధర రోజురోజుకూ తగ్గుతోంది. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న రైతులకు ఈ యేడు వచ్చినంత తక్కువగా ఏ సంవత్సరం రాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు కొనుగోళ్లపై దృష్టి సారించకపోవడం వల్ల ధర పెరగలేదు. జాతీయ, అంతర్జాతీయ ప రిస్థితుల నేపథ్యంలో వ్యాపారులు ఒడిదొడు కులను, పాత స్టాక్‌ను దృష్టిలో పెట్టుకొని కొ నుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం కంటే తక్కువ ధరకు పసుపు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. భారీగా పసుపు వచ్చిన ధర మాత్రం మారడంలేదు. క్వింటాలుకు రూ. 4 వేల నుంచి రూ. 5వేల మధ్యనే ధర నిర్ణయిస్తున్నారు. పసుపునకు మద్దతు ధర కల్పిస్తాం అని ఏళ్ల తరబడి వాగ్దానాలు చేస్తున్నా ధరలు మాత్రం రావడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం క్వింటాలు కు రూ.6850 నిర్ణయించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం ధర నిర్ణయిస్తే తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ అయిదేళ్లలో పసుపు ధర భారీగా తగ్గింది. కూలీలు, ధరలు, ఎరువులు, ఇతర రసాయనాల ధరలు పెరిగాయి. రైతులకు మ్యాచింగ్ గ్రాంట్‌లాగా నిధులను విడుదల చేసి పసుపు రైతులకు ఇవ్వాలని కోరుతున్నారు.

మహిళా సర్పంచ్‌కు సన్మానం

చిత్తూరు,మార్చి8(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివి.పురం మండలంలోని వివి.పురం గ్రామ సచివాలయంలోసర్పంచ్ లక్ష్మమ్మ, అంగన్వాడీ ఉద్యోగులను సోమవారం సన్మానిం చారు. మహిళలు ఎందులో అయినా రాణించగలరని కొనియాడారు. రాజకీయాల్లో వారి పాత్ర నిరుపమానమని అన్నారు. పదవి ఏదైనా పట్టుదలగా నిర్వహించడం వారికే చెల్లిందన్నారు. కార్యక్రమంలో దామోదర్ నాయుడు, ఉపాధ్యక్షులు దామోదర చారి, గుణశేఖర్ నాయుడు డిసెంబర్ శెట్టి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంటులో చీర్చనీయాంశంగా హై మాస్క్

న్యూఢిల్లీ,మార్చి8(ఆర్ఎన్ఎ): చేవెళ్ల మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి రూపొందించిన హై ఎఫెషియన్సీ మాస్క్ పార్లమెంట్‌లో చర్చనీయాంశమైంది. ఆయన రూపొందించిన మాస్క్‌తో రాజ్యసభ ఎంపీ డాక్టర్ నరేంద్ర జాదవ్ పార్లమెంట్ హాల్‌లో కనిపించారు. దీంతో అందరి దృష్టి ఆయనపై పడింది. పలువురు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు.

దీనిపై ఆయనతో మాట్లాడగా.. 99.7 శాతం శుద్ధతో కూడిన ఆక్సిజన్‌ను ఇది అందిస్తుందన్నారు. దీన్ని మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి రూపొందించారని డాక్టర్ జాదవ్ తెలిపారు. స్వయంగా ఇంజినీర్ అయిన విశ్వేశ్వర్ రెడ్డి... కరోనా కాలంలో పలు ఆవిష్కరణలు చేసిన విషయం తెలిసిందే. మాస్క్‌లతో పాటు, ఇంట్లోనే శానిటైజ్ తయారు చేసుకోవడం, కరోనా పేషంట్లకు ప్రత్యేక వెంటిలేటర్ 'పైసెషన్ ఎయిర్ పంప్(పీఏపీ)'ను ఆయన ఆవిష్కరించారు. ఇవేగాక గతంలో ఆయన 'పేషెంట్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్'ను తయారు చేశారు

షీటీమ్స్ రాకతో పెరిగిన భరోసా

మహిళల రక్షణలో ముందున్న పోలీసులు

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): తెలంగాణలో మహిళల రక్షణకు షీ టీమ్స్ ఏర్పాటు చేశాక మంచి ఫలితాలు వస్తున్నాయి. మహిళలకు అండగా బాగా పనిచేస్తున్నాయి. మహిళా దినోత్సవం సందర్భంగా అనేక కార్యక్రమాలతో చైతన్యం చేపట్టారు. ఇకపోతే షీ టీమ్స్ బాధ్యతను నిర్వహిస్తున్న స్వాతి లక్రా కృషి ప్రశంసనీయం. సిటీ పోలీస్ తరపున ఈనెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు చేపట్టారు. షీటీమ్స్ ఏర్పడి ఆరేళ్లు పూర్తవుతున్నందున వారి పాత్రను,కృషిని అభినందించాల్సిందే. ఎన్నో క్లిష్టమైన సమస్యలను, కేసులను పరిష్కరించడంతో పాటు..మహిళలకు తామున్నామన్న భరోసా ఇవ్వడంలో షీ టీమ్స్ విజయం సాధించాయి. డయల్ 100, మహిళా భద్రత, షీ టీమ్స్ గురించి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించారు. ఉమెన్ సేఫ్టీ విషయంలో అనేక చర్యలు తీసుకున్నారు. మహిళలను వేదించిన లేదా రేప్ కేసుల్లో నిందితులకు శిక్ష ఖరారు చేయించడంలో షీటీమ్స్ కీలక భూమిక పోషించాయి. యువతులు, మహిళలు ఇక నగరంలో నిర్భయంగా ఉండొచ్చన్న భరోసా దక్కడంలో ఈ టీమ్స్ బాగ కృషి చేస్తు న్నాయి. వారికి అండగా, రక్షణగా 'షి' బృందాలను ఏర్పాటు చేసి వారి భద్రతకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగేసింది. స్వాతిలక్రా ఆధ్వర్యంలో పనిచేసే ఈ బృందాల్లో అందరూ మహిళా పోలీసులే ఉంటారు. ఒక్కో బృందంలో ఐదుగురు మహిళా పోలీసులు ఉంటారు. వీరంతా సాధారణ డ్రెస్‌లోనే ఉంటారు. బస్టాపులు, రైల్వేస్టేషన్లు, ఆటోస్టాండ్ల వద్ద, కళాశాలల వద్ద నిఘా వేస్తారు. మహిళలను వేధింపులకు గురి చేసిన వారిని తక్షణమే అదుపులోకి తీసుకుంటారు. ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 100కు ఫోన్ చేస్తే తక్షణ సాయం అందిస్తామని స్వాతిలక్రా మహిళలకు సూచించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతూ షి బృందాలకు పట్టుబడిన వారు జాగ్రత్తగా ఉండకపోతే వారిపై క్రైమ్‌షీట్ తెరుస్తారు. ఆ వివరాలు అన్ని పోలీస్‌స్టేషన్లలో అందుబాటులో ఉండేలా సెంట్రల్ డేటాలో పొందుపరుస్తారు. ఈవ్‌టీజర్ల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వా రి సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తారు. చట్ట ప్రకారం శిక్షించడమే కాకుండా, మళ్లీ పట్టుబ డి తే నిర్భయ కేసును నమోదు చేస్తారు. ఈవ్‌టీజర్లపై నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చని, ఎ. ర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఐపీఎస్ స్వాతి లక్రా భరోసా ఇచ్చారు.

దేశానికి గర్వకారణం పివిసింధు

భారత కీర్తిపతాకను రెపరెపలాడించిన క్రీడాకారులు

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): క్రీడారంగంలో మెరుపులు పూయిస్తున్న ఎందరో మహిళా క్రీడాకారులు భారత కీర్తిపతాకాన్ని ఆకాశంలో ఎగురవేశారు. సానియా మిర్జా,సైనా నెహ్వాల్, పివి సింధు, మేరీ కోమ్ వంటి వారు ప్రస్తుత సమాజంలో ఇంకా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. వారు క్రీడారంగంలో చేస్తున్న కృషి భారత ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది. ఇందులో తెలుగమ్మాయి పివి సింధు ఎన్నో అద్భుతాలతో రాణించి పద్మశ్రీని దక్కించుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మెరిసిన పి.వి.సింధు కృషి అభినంద నీయం. ఆమె ఎలాంటి ప్రోత్సాహం లేకుండానే రాకెట్ పట్టి ఎంతో కఠిన దీక్షతో ఈ దశకు చేరుకుంది.ఈ యజ్ఞంలో ఆమె ఎక్కడా తడబాటుకు గురికాకుండా, ఆత్మస్థయిర్యం కోల్పోకుండా అప్రతిహతంగా ముందుకు సాగిన తీరు అభినందనీయం. ఇంతటి ఘనకీర్తి సాధించడానికి వ్యక్తిగతంగా ఆమె కష్టపడితే ఆమె కష్టానికి తల్లిదండ్రులు, కోచ్ పుల్లెల గోపీచంద్ తోడ్పడ్డారు. అయితే ఆర్థికంగా కూడా ఆమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడినా స్వర్ణం గెలవడం సింధుకు మరచిపోలేని అనుభూతిగా మిగిలింది. గతంలో వరుసగా రెండేళ్లు సెమి ఫైనల్ చేరి కాంస్య పతకాలతోనే సరిపెట్టుకుని, ఆ తర్వాత వరుసగా రెండేళు ఫైనల్ చేరినా రజత పతకానికే పరిమితమైంది. పక్కా ప్రణాళిక తో సిద్ధమై అనుకున్నది సాధించి, విశ్వకిరీటాన్ని అందుకొన్న తొలి భారత క్రీడాకారిణిగా గణుతికెక్కింది. 'రియో'తో మొదలైన జోరును ఇంకా కొనసాగిస్తున్న సింధు ప్రపంచ టోర్నీ స్వర్ణంతో తన స్థాయిని మరింత పెంచుకుంది. నిజానికి రియోలో ఒలంపిక్స్‌లో సింధు రజత పతకం, సాక్షి కంచు పతకం సంపాదిం చడంతో భారత్ పరువు నిలిపారు. అయితే ఒలంపిక్స్ పట్టికలో మనం ఎప్పుడూ కింది నుంచి ఫస్ట్ ఉండడానికి ప్రయత్నిస్తున్నాం. సింధులాంటి వారు పతకాలు సాధించారంటే అందులో ప్రభుత్వాల ఘనకార్యం ఏమీ లేదు. వారు తమ సొంతంగా ఆట నేర్చుకుని మన పరవును నిలబెట్టేందుకు ప్రయత్నించారు. నిజానికి ముందునుంచే ప్రభుత్వాలు వీరిని ప్రోత్సహించి ఉంటే బంగారు కొండల్లా మెరిసే వారు. బేరీ బచావో..బేరీ పడావో నినాదంగా మారరాదు. సింధును స్ఫూర్తిగా తీసుకుని ఆడపిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. ఆడపిల్లల క్రీడలకు, విద్యకు ఉచిత సౌకర్యాలు, మినహాయింపులు ఇవ్వాలి. అలా చేయడం ద్వారా సింధు లాంటి ఎందరినో తయారు చేసుకోవాలి. సింధు సాధించిన విజయంతో దేశంలో బ్యాడ్మింటన్‌కు మరింత ఊపు వస్తుందన డంలో సందేహం లేదు. సింధు గెలిచిన స్వర్ణపతకం దేశంలో షటిల్ విప్లవానికే కాకుండా క్రీడా విప్లవానికి, ప్రభుత్వాలు కళ్లు తెరవడానికి తెరతీయాలని కోరుకుం దాం. సైనాకు తోడు సింధు, కశ్యప్, జ్వాల, అశ్విని లాంటి క్రీడాకారిణులు కూడా ప్రపం చ స్థాయికి ఎదగడంతో రాకెట్‌కు మరింత ఊపొచ్చింది. ఇప్పటిదాకా భారత బ్యాడ్మిం టన్‌లో సాధి ంచిన పురోగతి అంతా ఒక ఎత్తయితే.. సింధు స్వర్ణం గెలవడం మరో ఎత్తు.

క్రికెట్‌కు ఇచ్చిన ప్రాధాన్యం మిగతా క్రీడలకేదీ

-మహిళా అథ్లెట్లకు మరింత ప్రోత్సాహం అవసరం

న్యూఢిల్లీ,మార్చి8(ఆర్ఎన్ఎ): భారత్ లాంటి విశాలమైన దేశంలో సవాళ్లు ఉన్నప్పటికీ, గ్రామాల స్థాయిలో క్రీడలకు సంబంధించి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే మహిళా అథ్లెట్లు మరింత మంది ముందుకొచ్చే అవకాశం ఉంటుంది. మెరుగైన శిక్షణ, పోషకాహారం లాంటి కారణాలతో ఇప్పటికీ దేశంలో క్రీడలు పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని చాలామంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చెస్‌కు భారత్‌లో ఉండాల్సినంత ఆదరణ లేదని గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్ తర్వాత దేశంలో క్రీడలకు సంబంధించి మౌలిక సదుపాయాలు చాలా మెరుగయ్యాయి. అయినప్పటికీ, అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చితే ఇంకా చాలా మెరుగవ్వాల్సి ఉంది. ఇప్పటికీ దేశంలో క్రికెట్‌దే ఆధిపత్యం. అయితే, క్రీడా అభిమానులు, మీడియా పురుషుల క్రికెట్ జట్టుకు ఇచ్చినంత ప్రాధాన్యత, మహిళల జట్టుకు ఇవ్వడంలేదు. క్రికెటర్లకు వచ్చినంత గుర్తింపు ప్రపంచ, ఏషియన్, కామన్వెల్త్ ఛాంపియన్లకు రావడంలేదు. ఖేలో ఇండియా గేమ్స్‌లో బాలికలు పతకాలు సాధిస్తున్నారు. షూటింగ్‌లో పలు అంతర్జాతీయ పతకాలు సాధించిన 17 ఏళ్ల రామ్ కిషన్ భాకెర్ తమకు పెద్దగా ప్రచారం రావడం లేదని అంటోంది. కొన్ని చిన్న గ్రామాల్లో ఆటల గురించి ఏమాత్రం అవగాహన ఉండదు. పోటీల గురించి కొంతమంది గ్రామీణులకు తెలియదు. కానీ, కాస్త దృష్టి పెడితే ఆ ఊళ్లలోనే మెరుగైన ఆటగాళ్లు దొరుకుతారు. మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి. అబ్బాయిల్లాగే తాము కూడా క్రీడల్లో రాణించగలమని పోరాడాలి. సాంస్కృతిక, సంప్రదాయ అవరోధాలను అధిగమించాలి' అని సుమా శిరూర్ అంటున్నారు. మహిళలు స్వయం శక్తి దిశగా ఎదిగేలా పథకాలను కేంద్రం తీసుకుని రావాలి. అన్నిరంగాల్లో విజయాలు సాధిస్తున్న మహిళలు ప్రోత్సహిస్తే మరింతగా రాణించగలరు. సానియా మిర్జా, సైనా నెహ్వాల్, పివి సింధు,సాక్షి ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో మనదేశంలో తమ పిల్లలు అడపిల్లలని చూడడం లేదు. వారిని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు వెనకాడడం లేదు. ఎందరో ఆడపిల్లల తల్లిదండ్రుల తమ పిల్లలను అతి కష్టం మీద చదివిస్తున్నారు. వారికి వెన్నంటి నిలిచి ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి వారికి కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటించాలి. ఫీజులు, విద్యా రుణాలు,క్రీడాంశాల్లో రాయితీలు ఇవ్వాలి. ఇలాంటి తల్లిదండ్రులును ప్రోత్సహించేందుకు సింధు విజయాన్ని ఓ స్ఫూర్తిగా తీసుకోవాలి. అప్పుడే ప్రధాని మోడీ ఇచ్చిన బేరీపడావోకు అర్థం ఉంటుంది. సింధు ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ స్ఫూర్తి పొందిన సింధు ఇంటి పక్కన చిన్నారులతో బ్యాడ్మింటన్ ఆడడం మొదలు పెట్టింది. ఆమె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు దగ్గర్లోని రైల్వే శిక్షకుడి వద్ద చేర్పించారు. తర్వాత మెరుగైన శిక్షణ కోసం గోపీచంద్ అకాడమీలో చేర్పించారు. ఇలా కొన్నేళ్లుగా బ్యాడ్మింటన్ తర్ఫీదుని కొనసాగిస్తున్న సింధు ఎవరెస్ట్ శిఖరం లాంటి ఒలంపిక్స్ దశకు చేరుకుంది. ఒకవైపు ఆటల్లో.. మరోవైపు చదువులో రాణించడ మంటే కత్తిమీద సామే అయినా సింధు రెండింట్లోనూ సత్తా చాటింది. ఒలింపిక్స్‌లో కాంస్యం, ఎన్నో సూపర్ సిరీస్‌లు, మరెన్నో గ్రాండ్ ప్రి టైటిళ్లు సొంతం చేసుకున్న సైనా నెహ్వాల్ భారత బ్యాడ్మింటన్ స్టార్. ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం సైనా పోరాడుతున్న రోజుల్లో రాకెట్‌లా దూసుకొచ్చిన సింధు... ఆ ఘనతను పోటీ పడ్డ తొలిసారే కైవసం చేసుకుంది. ఈ ప్రత్యేకతతో ఒక్కసారిగా భారత బ్యాడ్మింటన్‌కు పర్యాయపదంగా మారిన సైనా సరసన చేరింది.

మహిళపై యాసిడ్ దాడి

-ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి సత్యవతి

మెదక్,మార్చి8(ఆర్ఎన్ఎ): మహిళా దినోత్సవం రోజున జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్‌లో వివాహితపై గుర్తుతెలియని దుండగులు యాసిడ్ దాడి చేశారు. దీనిని గమనించిన స్థానికులు బాదితురాలిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధిత మహిళది మల్కాపూర్ తండా వాసి చత్రుబాయ్‌గా పోలీసులు గుర్తించారు. మహిళపై యాసిడ్ దాడి చేసిన సంఘటనపై గిరిజన, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తీవ్రంగా స్పందించారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు వెంటనే అందేలా చూడాలని మహిళాభివృద్ధి-శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. విచారణ వేగంగా జరిపి దోషులపై కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితురాలు టేక్మాల్ మండలం అంతాయిపల్లి తండా వాసిగి గుర్తించడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పాలని అధికారులకు సూచించారు.

జిల్లాలో దారుణ ఘటన

చెత్తకుండీలో ఆడ శిశువు గుర్తింపు

మహబూబాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): ప్రపంచ మహిళ దినోత్సవం రోజున మహబూబాబాద్ జిల్లాలో దారుణం వెలుగుచూసింది. దోర్నకల్ మండలం, బూర్గుపాడులో చెత్తకుండీలో ఆడ శిశువును పడేశారు. అప్పుడే పుట్టిన ఆ శిశువును గోనె సంచిలో కట్టి చెత్త కుండిలో పడేశారు. వ్యవసాయ పనికి వెళుతున్న కూలీలు శిశువు ఏడుపును కనిపెట్టి బయటకు తీశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు శిశువును ఏరియా ఆస్పత్రికి తరలించారు. మహిళ దినోత్సవం నాడే ఇంతటి దారుణం చోటు చేసుకోవడంపై గ్రామస్తులు కంటతడి పెట్టారు. ఆడపిల్లగా పుట్టడమే పాపమా? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిశువును చెత్తకుండిలో పడేసిన తల్లిదండ్రులను వదలొద్దని, మరో శిశువుకు ఇలా జరక్కుండా కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగ

పాడిపశువులకు దాణా కొరత

-శాశ్వత ప్రాతిపదికన పశుగ్రాసం కోసం ఎదురుచూపు

చిత్తూరు,మార్చి8(ఆర్ఎన్ఎ): పాలఉత్పత్తిలో జిల్లా దేశంలోనే ప్రథమస్థానంలో వుంది. అయితే దానికి తగ్గట్టుగా పాడి పశువులకు పశుగ్రాసం అందడం ఇబ్బందిగా ఉంది. జిల్లాలో పాడి రైతుకు అప్పుడే కష్టకాలం మొదలైంది. మార్చి ప్రారంభంలోనే ఎండుగడ్డికి కొరత ఏర్పడడంతో నాలుగైదు నెలల పరిస్థితి ఎలా ఉంటుందో అని పాడిరైతులకు ఆందోళన కల్గిస్తోంది. మార్చి నుంచి జూన్ వరకు ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఎండుగడ్డి కూడా దొరకని పరిస్థితి ఎదురవుతుంటుంది. రానున్న 90 రోజులకు అంటే మార్చి నుంచి మే నెలాఖరు వరకు పశుగ్రాసం అవసరం. పశుగ్రాసం కొరత తీర్చడానికిగాను రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అమలు చేసిన పథకాలన్నీ ప్రస్తుతం అమలులో వున్నా నామమాత్రంగానే కొనసాగుతునాయి. పడమటి మండలాల్లో పశుగ్రాసం కొరత తీవ్రంగా వుంది. దాంతో తూర్పు ప్రాంతానికి చెందిన శ్రీకాళహస్తి, ఏర్పేడు, బీఎన్కండ్రిగ, వరదయ్యపాళెం తదితర మండలాలనుంచి ఎండుగడ్డిని లారీలు, ట్రాక్టర్లలో తెచ్చుకుంటున్నారు. అక్కడి వ్యాపారులు పడమటి మండలాలకు తీసుకొచ్చి ఒక ట్రాక్టరు ఎండుగడ్డి అమ్ముకుంటున్నారు. పూతలపట్టు మండలంలోని రంగంపేట క్రాస్, పాకాల మండలంలోని నేంద్రగుంట తదితర ప్రాంతాల్లో రోజుకు 20 నుంచి 25 లోడ్ల ఎండుగడ్డి విక్రయించేస్తున్నారు.

జిల్లాలో పశుగ్రాసం కొరతను తీర్చేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో పశువులకు అవసరమైన వరిగడ్డి, పచ్చిగడ్డికి ప్రత్యామ్నాయంగా పాతరగడ్డి, దాణామృతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అమ్మఒడి కోసం ఎదురుచూపు

-పథకం అమలులో పలువురు అసంతృప్తి

గుంటూరు,మార్చి8(ఆర్ఎన్ఎ): అమ్మఒడి కింద .ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తామంటున్నా.. జిల్లాలో వివిధ కారణాలు చూపుతూ వేలల్లో దరఖాస్తులను పక్కన పడేశారు. ఆయా కారణాలపై అభ్యంతరాలకు అవకాశం ఇచ్చినా ఇంతవరకు వారి ఖాతాల్లో నగదు జమ కాలేదు. వలంటీరు నుంచి సచివాలయ ఉద్యోగుల వరకు ఇటు పాఠశాలల్లోనూ, అటు విద్యాశాఖ అధికారులు అమ్మఒడి తల్లుల గోడు గురించి పట్టించుకోవడంలేదు. జిల్లాలో అధికారులు చొరవ చూపకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తోన్నారు. గతంలో ఏదైనా సమస్య వల్ల ఎక్కువమంది ప్రజలు ఇబ్బంది పడుతుంటే మొత్తం యంత్రాంగం కదిలి వచ్చి పరిష్కరించేది. నేడు ఆ పరిస్థితి జిల్లాలో కనిపించడం లేదని అమ్మఒడి నగదుని అందుకోలేకపోయిన తల్లులు వాపోతోన్నారు. తమ అభ్యంతరాలపై ఏమి చర్య తీసుకున్నారని వలంటీర్లు, గ్రామ సచివాలయాల సిబ్బందిని నిత్యం ప్రశ్నిస్తోన్నారు. ప్రతి రోజు సచివాలయాలకు వెళ్లి వాకబు చేస్తూ తీవ్ర నిరాశతో ఇళ్లకు చేరుకుంటున్నారు. విద్యుత్ బిల్లుల్లో తప్పులు, ఆదాయపు పన్ను చెల్లించకపోతోన్నా చెల్లిస్తోన్నట్లుగా డేటా ఎంట్రీ, ఆధార్, బ్యాంకు అకౌంట్, రేషన్కార్డు నెంబర్లు తప్పుగా నమోదు చేయడం, విద్యార్థులకు 90శాతం పైగా హాజరు ఉన్నా లేనట్లుగా పేర్కొనడం, ఇల్లు, భూమి తక్కువ విస్తీర్ణం ఉన్నా ఎక్కువగా చూపించడం తదితర కారణాలతో జిల్లాలో లక్షా 339 మందికి అమ్మఒడి నగదు అందకుండా చేశారు. కొంత మంది అయితే స్పందనలో అభ్యంతరాలు పెట్టగా వాటిపై చర్య తీసుకున్నామని, అయితే ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తోన్నామని పాఠశాల విద్యా శాఖ సమాధానాలు పంపించింది.

రైతు వేదికలు దేశానికే ఆదర్శం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 8: రైతు వేదికలు దేశానికే ఆదర్శమని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లాలోని సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామంలో రూ.22 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు వేదిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. అన్నదాతలు రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు పంటల విషయంలో ఏ సమస్య వచ్చినా ఈ వేదికలో వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంటారని.. సమస్యలు పరిష్కరించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు నల్ల వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ అట్ల మైపాల్ రెడ్డి, జెట్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముంబైలో మళ్లీ లాక్‌డౌన్.. అవకాశాలు ఉన్నాయంటున్న మంత్రి

ముంబై , మార్చి 8: దేశ ఆర్థిక రాజధాని అయిన ముంబైలో కరోనా వైరస్ మళ్లీ విస్తరిస్తున్నది. గత కొన్నిరోజులుగా కొత్త కేసులు నమోదవుతుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పరిస్థితి అదుపులోకి రానిపక్షంలో ముంబైలో మళ్లీ లాక్‌డౌన్ విధించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ విషయాన్ని ముంబై గార్డియన్ మినిస్టర్ అస్లాం షేక్ కూడా ధ్రువీకరించడమే కాకుండా.. మరో 8 రోజులు పరిస్థితులను సమీక్షించి వ్యాప్తి అదుపులో లేనిపక్షంలో పాక్షిక లాక్‌డౌన్ విధిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం మళ్లీ లాక్‌డౌన్ విధించనున్నట్లు వార్తలు రావడంతో ముంబైలోని అన్ని ప్రాంతాల్లో కిరాణా దుకాణాల వద్ద ప్రజలు బారులు తీరి నిత్యావసరాలను కొనుగోలు చేస్తున్నారు.

ముంబైలోని పలు ప్రాంతాల్లో మళ్లీ కరోనా వైరస్ విజృంభిస్తున్నది. గత వారం రోజులుగా ముంబై వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. ఇక వైరస్ అంతం అయిపోయిందని భావిస్తున్న తరుణంలో మళ్లీ జడలు విప్పడంతో ప్రజలు, అధికారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆదివారం ఒక్కరోజే 142 కేసులు నమోదవడంతో మొత్తం కేసుల సంఖ్యల 11.141 కి చేరుకున్నది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రెండు రోజుల క్రితం మహారాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణం నుంచి దాదాపు 2,746 శాంపిల్స్ పరీక్షలకు తీసుకెళ్లగా.. వాటిలో 36 పాజిటివ్‌గా తేలాయి. కాగా, ఒక్క ముంబై విమానాశ్రయంలోనే గత ఏడాది సెప్టెంబర్ నుంచి 2021 ఫిబ్రవరి నెలాఖరు వరకు 1480 కొత్త కేసులు రికార్డయ్యాయి. ముంబై విమానాశ్రయంలో ఇప్పటివరకు 2.20 లక్షల మంది కరోనా పరీక్షలు జరిపారు. గత నెల ఆరో తేదీ నుంచి విమానాశ్రయం ప్రాంగణంలో ఆర్‌టీ-పీసీఆర్ పరీక్షాకేంద్రం అందుబాటులోకి వచ్చింది. ముంబైతోపాటు పలు ప్రాంతాల్లో తిరిగి కరోనా వ్యాప్తి చెందడం పట్ల మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే విచారం వ్యక్తం చేశారు. గత సెప్టెంబర్‌లో కంటే ఎక్కువగా కొన్నిప్రాంతాల్లో కేసులు రావడం ఆందోళన కలిగిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో లాక్‌డౌన్ విధించే ఆలోచనేదీ లేదన్న ముఖ్యమంత్రి.. మజ్బూరీ అయితే మాత్రం ఏంచేయలేం కదా? అని చెప్పారు. ప్రజలు అవసరం ఉంటేనే ఇండ్ల నుంచి బయటకు రావాలని, కరోనా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని విన్నవిస్తూనే కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలు విధిగా మాస్కులు ధరించడంతోపాటు నిర్ణీత దూరం పాటించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఇలా ఉండగా, ముంబైలో పాక్షికంగా లాక్‌డౌన్ విధించే అవకాశాలు కనిపిస్తున్నాయని గార్డియన్ మినిస్టర్ అస్లాం షేక్ పేర్కొనడం బట్టి.. వైరస్ వ్యాప్తికి అడ్డుకట్టపడని పక్షంలో లాక్‌డౌన్ విధించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తున్నది.

భారత సాంప్రదాయాల గుర్తింపుకు లౌకికవాద ముప్పు: యోగి

లక్నో, మార్చి 8: భారత సాంప్రదాయాలకు లౌకికవాద ముప్పు పొంచి ఉందని, ప్రపంచ గుర్తింపునకు అందుకే నోచుకోవడం లేదని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. దీని నుంచి బయటపడటానికి స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. కంబోడియాలో పర్యటన సందర్భంగా అక్కడి ప్రముఖ ఆంగ్‌కోర్ వాట్ ఆలయాన్ని సందర్శించిన యోగి.. ఆ తర్వాత ఈ వ్యాఖ్యలు చేశారు. అక్కడి ఆలయంలోని ఓ గైడ్‌తో జరిపిన సంభాణ గురించి యోగి చెప్పారు. తనది బౌద్ధ మతం అని అతడు చెప్పాడని, కానీ ఆ బౌద్ధానికి మూలం కూడా హిందూమతమేనని యోగి అన్నారు. కంబోడియాలో ఆ యువకుడికి తనది బౌద్ధ మతమని తెలిసినా దాని మూలాలు కూడా అతనికి తెలుసు. అతను ఆ విషయాన్ని స్వేచ్ఛగా చెప్పాడు. అదే ఇలాంటి విషయాలు ఇండియాలో చెబితే చాలా మంది లౌకికవాదం ప్రమాదంలో పడుతుంది. ఈ లౌకికవాదమనేది భారత ప్రాచీన సాంప్రదాయాలకు పెను ముప్పు. వాటికి ప్రపంచ గుర్తింపు లేకుండా చేస్తోంది అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. అసలైన జీవిత పాఠాలను చెప్పేవి రామాయణ, మహాభారతాలేనని ఈ సందర్భంగా యోగి స్పష్టం చేశారు.

రజకులను ఎస్సీలో చేర్చాల్సిందే

న్యాయం కోసం ఆయా వర్గాలు ఎదురు చూపు

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఉద్యమ సమయంలో రజకులను ఎస్సీలలోకి, కాయితీ లంబాడీలు, వాల్మీకి బోయలు, వడ్డెరలను ఎస్టీలలోకి చేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఇప్పుడా హామీ ఏమయ్యిందని ఆయా వర్గాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ముస్లింల రిజర్వేషన్ల నేపథ్యంలో తమ సంగతేంటని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో 6 శాతంఉన్న ఎస్టీ రిజర్వేషన్లను 12శాతానికి పెంచుతామని కూడా అధికారికంగా ప్రకటించింది.

అయితే ప్రస్తుతం ఈ విషయం గురించి పెద్దగా మాట్లాడటం లేదు. తమ సామాజిక స్థితిని మార్చుకోవాలని రజకులు, వాల్మీకి బోయలు, కాయితీ లంబాడీలు, వడ్డెరలు దశాబ్దాల కాలంగా చేస్తున్న పోరాటాల గురించి పెదవి విప్పడంలేదు. సమాజంలో నిజంగా అణగారిన వర్గాల వారిని ఆదుకోవడమే ప్రభుత్వ ఉద్దేశం అయితే ఈ వర్గాలు కోరుతున్న విధంగా వారిని ఎస్సీ, ఎస్టీ జాబితాల్లోకి చేర్చడంపై కూడా అసెంబ్లీలో చర్చించాలని కోరుతున్నారు. అందరి ఆమోదంతో ఈ వర్గాల గురించి కూడా ఒక నిర్ణయానికి రావాలి. అలాగే టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కూడా హామీ ఇచ్చింది. కానీ ఈ విషయంగా ఇప్పటివరకు ఎవరూ మాట్లాడటం లేదు. సచార్ కమిటీ నివేదిక ప్రభుత్వానికి ఎప్పుడో అందినా గడిచిన మూడేళ్ల కాలంలో దానిని పట్టించుకోకుండా బుట్టదాఖలు చేశారని కొందరు వాదిస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత ఇప్పుడు రిజర్వేషన్ల గురించి హడావిడి చేస్తున్నారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి పొందాలన్న పథకంతోనే తప్ప సమాజంలో అణగారిన ఆ వర్గాల వారికి మేలు చేయాలన్న ఉద్దేశంతో కాదన్నది వారి అభిప్రాయం. వాస్తవానికి తమిళనాడులో ముస్లింలకు 3.5 శాతం రిజర్వేషన్లు మాత్రమే ఇస్తున్నారు. అలాగే అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం లాంటి రాష్ట్రాలలో లో 80 శాతం రిజర్వేషన్లు ఉన్నాయన్నది ప్రభుత్వవాదన. అయితే ఆయా రాష్ట్రాలలో అత్యధికంగా గిరిజనులే ఉంటున్న కారణంగా రాజ్యాంగంలో ఇచ్చిన వెసులుబాటు మేరకు వారికి ఆ రిజర్వేషన్లు ఇవ్వడం జరిగింది. ఇవి కాదనగలమా అని అంటున్నారు. వెసకబాటుకు, సామాజిక వివక్షకు గురయిన అనేక వర్గాలకు కూడా న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ కావాలి

అప్పుడే క్రీడాకారులకు అవకాశాలు

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): ఓట్ల కోసం పథకాలు కాకుండా క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. అందుకు క్రీడా పాలసీని ప్రకటించాలి. మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేసేందుకు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం కనీసం ఇప్పటి నుంచయినా ప్రయత్నించాలి. బాల్యంలోనే క్రీడాంశాలపై మక్కువ కల్పించి ప్రత్యేక స్పోర్ట్స్ స్కూళ్లను తెలవాలి. అందుకు ఎంత ఖర్చయినా వెరవకుండా ముందుకు సాగాలి. ఇవాళ ఇంట్లో ప్రతి మగపిల్లాడికి బ్యాట్ పట్టడం తప్ప మరో క్రీడ తెలియకుండా పోతోంది. క్రికెట్ మాత్రమే కాదు.. బ్యాడ్మింటన్ సహా అనేక ఆటలు ఉన్నా యన్న సంగతి ముందుగా తెలియ చెప్పాలి. మన ఒకప్పుడు హాకీ క్రికెట్ కంటే మిన్నగా అభిమానుల ఆదరణకు నోచుకుంది కానీ.. తర్వాత భారత జట్టు ప్రదర్శన లాగే దానికున్న ఆదరణా పడిపోయింది. అది మన జాతీయ క్రీడ అయినా దానిని పక్కన పెట్టేశాం. హాకీతో పాటు మిగతా ఆటలన్నీ కూడా ఉన్నా వాటిని ఆదరించుకోవడం లేదు. నిరాదరణ కారణంగానే కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రైవేట్ ప్రోత్సాహంతో సింధులాంటి వాళ్లు షటిల్ బ్యాడ్మింటన్ పట్టల మక్కువ పెంచుకోవడంతో ఇప్పుడు దీనికి ఆదరణ పెరగగలదు. గత కొన్నేళ్లలో బ్యాడ్మింటన్ అంచెలంచెలుగా ఎదిగి, ఆదరణ పెంచుకుని.. ఇప్పుడు దేశంలో లక్షల మంది ఆ ఆట ఆడేందుకు ముందుకొచ్చేలా.. కోట్ల మంది కీలక మ్యాచ్‌లను వీక్షించేలా చేయగలిగింది. ఇందులో పుల్లెల గోపీచంద్ పాత్ర అత్యంత కీలకం. బ్యాడ్మింటన్ బంగారు భవిష్యత్తుకు గట్టి పునాది వేశాడు గోపీచంద్. దశాబ్దం కిందట అతను నెలకొల్పిన అకాడమీ ఇప్పుడిప్పుడే వేళ్లూనుకుంటోంది. సైనా రూపంలో ప్రపంచ స్థాయి క్రీడాకారిణిని తీర్చిదిద్ది.. దేశంలో బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్నే మార్చేసిన ఘనత గోపీచంద్‌ది. ద్రోణాచార్య లాగా తర్ఫీదు ఇచ్చి మెరికల్లాంటి షటిలర్లను తయారు చేస్తున్నాడు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ గొప్ప పురోగతి సాధించింది. ఇప్పటికే ఆదేందుకు, చూసేందుకు మంచి ప్రత్యామ్నాయంగా మారిన బ్యాడ్మింటన్‌పై ఆసక్తి రెట్టింపవుతుందనడంలో సందేహం లేదు. అయితే ఈ స్ఫూర్తి కొనసాగాలంటే, మరిన్ని పతకాలు రావాలంటే ప్రభుత్వాల క్రీడా విధానాంలో మార్పుల రావాలి. కోచ్‌లను,క్రీడాకారులను ప్రోత్సహించాలి. అందుకే చైనా తరహాలో భారత్ ప్రభుత్వం కూడా క్రీడలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధంగా తయారవ్వాలి. సింధు మ్యాచ్‌లను చూసినప్పుడు కలిగిన అనుభూతి ఇప్పుడు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి నింపుతుందనడంలో సందేహం లేదు.

ఉద్రిక్తతలకు దారితీసిన అమరావతి ఉద్యమం

ప్రకాశం బ్యారేజ్‌పైకి వచ్చి మహిళా రైతుల ఆందోళన
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన కూడా తప్పని నిర్బంధం

అమరావతి,మార్చి8(ఆర్ఎన్ఎ): ప్రకాశం బ్యారేజి పై రాజధాని మహిళా రైతులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం ఉదయం నుంచి రాజధాని ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేస్తూ పికెటింగ్ ఏర్పాటు చేసి మహిళలను బయటకు రాకుండా అడ్డుకుంటున్నారంటూ.. మందడంలోని మహిళా రైతులు ప్రకాశం బ్యారేజీపై బైఠాయించి నిరసన తెలిపారు. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేసి, మంగళగిరి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దీంతో రాజధాని ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. రాజధాని రైతులు రోడ్లపైకి వచ్చి సీడ్ యాక్సిస్ రోడ్డుపై 'సేవ్ అమరావతి' అంటూ నినాదాలు చేసి నిరసన చేపట్టారు. వెలగపూడిలోని సచివాలయంలోకి ప్రవేశించడానికి యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో పలువురు మహిళలు కిందపడ్డారు. ఈ సందర్భంగా రాజధాని రైతులు మాట్లాడుతూ.. ఏడాదికి పైబడి నిరసనలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూడు రాజధానుల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈరోజు అరెస్టు చేసిన మహిళా రైతులను వెంటనే విడుదల చేయాలని, అంత వరకూ వెనక్కి తగ్గేది లేదని రైతులు స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు కూడా తమకు కనీస గౌరవం లేదా అని మహిళా రైతులు ప్రభుత్వాన్ని నిలదీసారు. ప్రభుత్వం, పోలీసుల తీరుకు నిరసనగా మరోసారి ఆందోళన బాటపట్టారు. ప్రకాశం బ్యారేజీపై అమరావతి మహిళా రైతులు భారీ ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే విషయం తెలియడంతో ముందే అప్రమత్తమైన పోలీసులు తెల్లవారు జామునుంచే తనిఖీలు చేపట్టారు. బ్యారేజీపై బైఠాయించి నిరసన తెలుపు దామనుకున్న మహిళల్ని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. మహిళా రైతులను మంగళగిరి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. విషయం తెలుసుకున్న రాజధాని ప్రాంత వాసులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. సేవ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తూ సీడ్ యాక్సిస్ రోడ్డుపైకి భారీగా చేరుకున్నారు. అప్పటికే పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు.. మహిళలు బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో మహిళా దినోత్సవం రోజున తమను నిర్బంధిస్తారా అని నిలదీస్తూ మందడంలో మహిళా రైతులు రోడ్డుపైనే బైఠాయించారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మందడంలోనే కాదు.. దాదాపు రాజధాని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. ప్రకాశం బ్యారేజీపై అందోళన చేస్తున్న మహిళా రైతులను నిర్బంధించడంతో రాజధాని గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాయపూడి నుంచి మందడం వైపు వస్తున్న మహిళలను పోలీసులు వెలగపూడి దగ్గరు అడ్డుకున్నారు. రోడ్డుపై ముళ్ల కంచెలు వేసి రాకపోకల్ని ఆపేశారు. మందడం శివాలయం సెంటర్లో మహిళలు రోడ్డుపై బైఠాయించారు. అమరావతికి మద్దతుగా నినాదాలు చేశారు. అయితే ధర్నా చేస్తున్న మహిళలకు అల్పాహారం అందిస్తుండగా.. పోలీసులు అడ్డుకోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ మహిళలు పురుగుల మందు డబ్బాలను చేతపట్టుకుని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోలీసులు, ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఆందోళన చేస్తున్న రాజధాని రైతులు వెలగపూడిలోని సచివాలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు మళ్లీ అక్కడ అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో పలువురు మహిళలు కిందపడ్డారు. ఏడాదికి పైగా తాము నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందించడం లేదని.. కనీసం మహిళ దినోత్సవం రోజు కూడా మహిళలకు రక్షణ లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. మహిళలకు నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని నిలదీస్తున్నారు. జై అమరావతి.. సేవ్ అమరావతి అంటూ నినానాదలతో హోరెత్తించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూడు రాజధానుల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయాన్నే అరెస్టు చేసిన మహిళల్ని విడుదల చేయాలని, అంత వరకూ వెనక్కి తగ్గేది లేదని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన మహిళా కార్మికులకు సన్మానం

నల్లగొండ, మార్చి8: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన మహిళా కార్మికులు కంచరికుంట్ల వెంకటమ్మ, గుండె బోయిన లింగమ్మ, గౌనియాలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ముందుగా ఉపాధ్యాయులు సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ రాపోలు పరమేష్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, రాజకీయ రంగాల్లోనే కాకుండా పనిచేసే ప్రతిచోట ప్రతి మహిళ గౌరవించ బడాలి అన్నారు. ఆడపిల్లలను ఎదగనివ్వాలని అన్నారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో సీఆర్పీ నాగయ్య, ఉపాధ్యాయులు పాపని బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జెసి ప్రబాకర్ రెడ్డి ప్రచారానికి పోలీసుల బ్రేక్

అనంతపురం,మార్చి8(ఆర్ఎన్ఎ): తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రచారానికి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి.

అనుమతి లేదంటూ మెయిన్ బజార్‌లో జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రచారాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై జేసీ ప్రభాకరరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రచారాన్ని అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై జేసీ కన్నీరు పెట్టారు. నిన్నటి వరకు ఉన్న మైక్, వెహికల్ పర్మిషన్ ఈ రోజు ఎందుకు లేదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఓటర్ల వద్దకు వెళ్తానని.. ఎవరికీ భయపడే భయపడే ప్రసక్తే లేదన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకే రక్షణ లేదని ఇక మరి వైసీపీకి ఓటేస్తే మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలన్నారు.

కరోనా సమయంలో మహిళా స్ఫూర్తి అమోఘం

ఇంటా బయటా మొలకవోని ధైర్యంతో విధి నిర్వహణ

న్యూఢిల్లీ,మార్చి8(ఆర్ఎన్ఎ): కరోనా సమయంలో మహిళలు తమ పాత్రను మరోమారు ఎంతో బాధ్యతగా పోషించారు. వారు ఇటు విధి నిర్వహణలోనూ..అటు కుటుంబ బాధ్యతలోనూ కత్తిమీద సాములా తమ విద్యుక్త దర్మన్ని నిర్వహించారు. ప్రేమ పంచడంలో.. ముందుండే ఆమె కరోనా వేళ మరింత శక్తివంతంగా తయారైంది. కుటుంబ బాధ్యతలు మోస్తూనే వైరస్‌వ్యాప్తి అడ్డుకోవడంలో కిందిస్థాయి నంచి అత్యున్నత స్థాయి వరకు ముందువరుసలో నిలబడి తన సత్తా చాటింది. కరోనా రోగులకు సేవలు అందించడంల ఎక్కడా వారు వివక్ష చూపలేదు. వైరస్ భయపెడుతున్నా విద్యుక్త ధర్మం నుంచి పారిపోలేదు.

ఏ ఆస్పత్రికి వెళ్లినా వారి సేవలు అభినందనీయం. అందుకే మహిళలు సమాన హక్కులు, అవకాశాలతో స్థిరమైన, ప్రశాంతమైన భవిష్యత్తును చేరుకోవడానికి ప్రతిరోజూ యుద్ధమే చేయాల్సి వస్తోంది. ఆమె ఏళ్ల తరబడి ఇంటా, బయటా తన విధుల్లో, బాధ్యతల్లో విజేతగానే నిలుస్తూ ఉంది.

అయినా కొంతమంది ధోరణి మారడం లేదు. ఏడాదికోసారి గౌరవిస్తే చాలు అనుకుంటున్న పాలకుల సమాజంలో ఉన్నాం మనం. ఈ పెడ ధోరణి ఇంకెంత కాలమో సాగడానికి వీలులేదు. ఢిల్లీ సరిహద్దు రైతు పోరాటంలో రైతు మహిళల పాత్ర వెలకట్టలేనిది.

ఒకపక్క ఇంటి పనులు, పొలం పనులు చూసుకుంటూనే ఎంతోమంది మహిళలు పోరాటపంథాలో నడుస్తున్నారు. అందుకే ఇటీవల ప్రపంచ పత్రిక 'టైమ్స్'లో వారి గురించి, వారు చేస్తున్న పనులు, ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రత్యేక కథనం వచ్చింది. అంతలా ప్రపంచాన్ని కదిలించారు. ఇప్పుడు ప్రపంచమంతా భారత్‌వైపు చూస్తుందంటే కారణం విభిన్న రూపాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలే. అయితే ఇంతటి శక్తివంతమైన మహిళ తన ఉనికి కోసం ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉండడం అత్యంత ఆందోళన కలిగించే అంశం. జిల్లా కోర్టులు దాటి రాష్ట్రకోర్టులు, దేశ అత్యున్నత న్యాయస్థానం వరకు న్యాయం కోసం ఆమె పోరాటం చేస్తున్నా అన్యాయమే జరుగుతోంది. శతాబ్దాల చరిత్ర పోరాటాల్లో ఆమె సింహభాగంలో నిలిచిన సందర్భాలెన్నో... ఇల్లు వాకిల్లు, పొలం పనులు చక్కబెట్టు కోవడమే కాదు... పోరాటంలో కూడా మేమున్నాం.. అంటున్నారు అశేష మహిళాలోకం. ఏడాదికోసారి ఆమెను గుర్తించడం, సంబరాలు చేసుకోవడం కాదు... సమాజ అభ్యున్నతిలో మహిళల పాత్రను ప్రతి క్షణం గుర్తించాలి. ప్రతిరోజూ మహిళలు సగర్వంగా తలెత్తుకు తిరిగేలా ఉండాలి. అప్పుడే మహిళలను గౌరవించిన వారం అవుతామని సగటు మహిళలు కోరుకుంటున్నారు.

మహిళలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీ

-శుభాకాంక్షలు తెలిపిన పిసిసి చీఫ్ ఉత్తమ్

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లోకానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మహిళలను రాజకీయంగా ప్రోత్సహించింది కాంగ్రెస్ పార్టీనే అని ఈ సందర్భంగా ఉత్తమ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత

లింగ సమానత్వ సాధన సాధ్యమేనా..!

(08 మార్చి 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా)

సృష్టిలో సగం మహిళ. సంతానలక్ష్మి అతివ. నవ్వులు పంచే త్యాగమయి వనిత. ఆర్థికాభివృద్ధిలో ఐశ్వర్యలక్ష్మి. గృహ కోవెలలో కొలువైన దేవత. ఓపికకు ప్రతీక. కుటుంబ సంక్షేమ నిధి. ఇంటి గడపకు ఆమె పసుపు పారాణి. మామిడి తోరణాల పచ్చని పందిరి పడతి. మగాడి గుండె సవ్వడి, మానవత్వ నెలవు. పురుష వృక్షానికి తల్లి వేరు గృహలక్ష్మి. ఎవ్వరికీ పట్టక పోయినా అందరి శ్రేయస్సు కోరే ఆదిశక్తి. పడతి పట్టుదలతోనే ప్రగతి పరుగిడు. సహనశీల మహిళలు గృహసీమ సంతోష సిరులు. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ, సంస్కృతిక ప్రగతిని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా 08 మార్చి రోజున నిర్వహించుకునే 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'లో భాగంగా సాహస సఫల ధీరవనితలను సన్మానించుకోవలసిన వేడుక. అంతర్జాతీయంగా లింగ సమానత్వ సాధన, మహిళల హక్కుల పరిరక్షణ, మహిళల ఆత్మగౌరవం, విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన, స్వేచ్ఛను అందించడం, ఆర్థిక స్వావలంభన, నిర్ణయాధికారాలు, భ్రూణ హత్యలను కట్టడి చేయడం, అత్యాచార హత్యలను నిలువరించడం, ప్రతిభావంతులైన మహిళలను గుర్తించి ప్రోత్సహించడం, మహిళా కేంద్రంగా కార్యక్రమాల నిర్వహణ చేయాల్సిన వేదికగా 08 మార్చి నిలుస్తుంది. అంతర్జాతీయ మహిళా దినం-2021 నినాదంగా 'సవాళ్ళను ఎంచుకొండి (ఛాలెంజ్ టు చాలెంజ్)' తీసుకున్నారు. 1975లో ప్రారంభమైన అంతర్జాతీయ మహిళా దినం సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను మరియు పరిస్కార మార్గాలను చర్చించడంతో పాటు వివిధరంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళామణులను సత్కరించుకోవడం జరుగుతోంది.

ప్రపంచాన్ని సవాళు చేస్తేనే నవ్య ప్రగతిరథం పరుగిడుతుంది. సవాళ్ళను ఎదుర్కొని నిలబడినపుడే సకారాత్మక మార్పులకు ఆస్కారం ఉంటుంది. అమ్మ, ఆలి, సోదరి, వదిన పాత్ర ఏదైన బేషరతుగా కుటుంబ సంక్షేమానికి అనుక్షణం శ్రమించే నిస్వార్థ ప్రాణి స్త్రీమూర్తి. అందరికీ అమ్మ కావాలి, ఆలి అనివార్యంగా ఉండాలి, కాని కూతురు వద్దంటోంది నేటి విచిత్ర ప్రపంచం. కూతురు ఓ భారం, కోడుకు ఓ వంశాంకుర దీపం అనే అనాగరిక సమాజంలో మనం ఉన్నాం. భ్రూణ హత్యలు, లైంగిక వేధింపులు, అత్యాచార హత్యలు, గృహ హింసలు, బాల్యవివాహాలు లాంటి పలు దురాచారాలను ఎదుర్కొంటున్న మహిళలు మేల్కొన వలసిన సమయం ఆసన్నమైంది. అనాదిగా మహిళా వివక్ష తీవ్రత ప్రాంతం, దేశం, మతం, కులం, వర్గం, వర్ణం, జాతి, సంప్రదాయం, ఆర్థిక స్థితి, సంస్కృతులను బట్టి మారుతూ వస్తున్నది. విద్య లేని సంస్కారి అయిన అబల చిన్నచూపును సహిస్తూ లింగ వివక్ష వలలో చిక్కిన శ్రమ జీవి. లింగ వివక్ష రాజ్యమేలినంత కాలం మహిళా సమాజం సమస్యల నడుమ నలుగుట ఖాయంగా తోస్తున్నది. మహిళలు ప్రవేశించని రంగం లేదు. అంతరిక్షంలో విహరించడం, సాగర సరిహద్దుల్లో గస్తీలు తిరగడం, అంతరిక్ష రహస్యాల శోధనలు చేయడం, యుద్ధ క్షేత్రంలో ధీర వనిత, అంతర్జాలాన్ని అన్వేషించడం లాంటి విధులను సమర్థవంతంగా నిర్వహించడం ఎరిగిన తెలివిగల మేధావి మహిళ. కొడుకుతో సమానంగా కూతురిని పెంచడం, విద్యను అందించాల్సిన కనీస బాధ్యత తల్లితండ్రులు మీద ఉంది.

భారతదేశంలో అధిక జనాభా, పేదరికం, నిరక్షరాస్యత లాంటి తీవ్ర సమస్యల నేపథ్యంలో మహిళలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇంట్లో మహిళకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉండదు. తల్లితండ్రులు అమ్మాయి పెంపకం నుంచే వివక్షను చూపుతూ, విద్యకు దూరం చేయడం జరుగుతోంది. బాల్యవివాహాల వలలో చిక్కి చిరు ప్రాయంలోనే తల్లులు కావడం, అనారోగ్యాల పాలు కావడం సర్వసాధారణంగా జరుగుతోంది. మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు, హత్యలు తరుచుగా జరగడం విచారకరం. ప్రేమ పేరుతో ఆసిడ్ దాడులు, గృహ హింస, ఆర్థిక అసమానత, వరకట్న వేదింపులు/చావులు, గర్భంలో ఆడ పిల్ల ఉందని అని తెలిసి అబార్షన్‌లు (భ్రూణ హత్యలు), బలవంతపు వ్యభిచారం లాంటి పలు సమస్యలను భారతీయ మహిళా సమాజం ఎదుర్కొంటున్నది. సమాజంలో సగమైన మహిళలు పార్లమెంట్‌లో 14.5 శాతం మాత్రమే ఉన్నారు. ప్రపంచదేశాల లింగ అసమాన సూచికలో 160 దేశాల్లో ఇండియా 127వ స్థానంలో ఉన్నది. మహిళల్లో సెకండరీ విద్య పూర్తి చేసిన మహిళలు 39 శాతం (పురుషులు 63.5 శాతం) ఉన్నారు. శ్రామిక లోకంలో 27.2 శాతం మహిళలు (78.8 శాతం పురుషులు) నమోదు అయినారు. భారత సమాజంలో అష్టలక్ష్ములను దేవతలుగా కొలిచిన సంస్కృతి మనది. చదువుల తల్లి సరస్వతి, సంపద దాత లక్ష్మి, ధైర్యానికి ప్రతీక దుర్గాలను పూజించడం మన నరనరాల్లో జీర్ణించుకు పోయింది. మహిళా మహాశక్తులను కొలుచుకోవడం ఒక వైపు, స్త్రీలను అశ్లీలంగా చూసే మృగాళ్ళు మరో వైపు ఉన్నారు. మహిళలో దేవతను దర్శించి, లింగ సమానత్వాన్ని సాధించే ప్రయత్నంలో మనందరం భాగస్వాములు అవుదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

మహిళలు అన్నివిభాగాల్లోనూ పురుషులతో సమానంగా పోటీపడాలి

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, మార్చి 8: (నేటినిజం ప్రతినిధి):మహిళలు అన్నివిభాగాల్లోనూ పురుషులతో సమానంగా పోటీపడేందుకు ముందుకురావాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గతంతో పోల్చిచూసినట్లయితే మహిళల్లో మార్పు శరవేగంగా వచ్చిందని, ఇదేస్ఫూర్తిని కొనసాగించాలని చెప్పారు

అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో అన్నిస్థాయిలకు చెందిన మహిళా పోలీసులతో కలిసి మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నివిభాగాల్లోనూ మహిళలు ప్రశంసనీయంగా పనిచేస్తున్నారన్నారు. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోవడం వల్ల ఎలాంటి విభేదాలు రాకుండా ఉండటమే కాకుండా అనుకున్నస్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. పరస్పర సహకారంతో ముందుకుసాగితే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. పోకిరీల చేష్టలు ఎక్కడ కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. షీబృందాల ఏర్పాటుతో పోకిరీల చేష్టలు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. కొన్నిచిన్నచిన్న సంఘటనలు చేటుచేసుకున్నా ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటలు చేసుకోవడం విచారకరమని తెలిపారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం అందించినట్లయితే వారిపేర్లను గోప్యంగా వివిధ రకాల ఆకర్షణలకులోనై ప్రేమవ్యవహారాలు జరిపి మోసాలకు గురికావొద్దని చెప్పారు. కరీంనగర్ కమిషనరేట్‌వ్యాప్తంగా హిళా పోలీసులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రత్యేక వాష్‌రూం, బట్టలు మార్చుకునేందుకు వీలుగా బ్యారక్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. తొలిసారిగా ఎల్‌యండి పోలీస్‌స్టేషల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, మిగతా ప్రాంతాల్లో నిర్మాణాలను సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. వివిధ రకాల బందోబస్తుల సందర్భంగా మహిళాపోలీసులకు ఇబ్బందులు ఎదురుకాకుండా మోబైల్‌వాష్‌రూంలను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. జీవితం యాంత్రికంగా మారిందని, అయినా మహిళల్లో మార్పులు రావడం ఆహ్వానించదగిన పరిణామమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా "ది గ్రేట్ ఇండియన్ కిచెన్"అనే లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. అన్నిస్థాయిలకు చెందిన అధికారులతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ మధ్యకాలంలోనే వివిధ రంగాలకు చెందిన మహిళలతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం వివిధస్థాయిలకు చెందిన మహిళా పోలీసు అధికారులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్, ఏఎస్‌పి రిథిరాజ్, ఏసిపిలు పి అశోక్, జె విజయసారధిలతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళాదినోత్సం కార్యక్రమాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు పలు కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన మహిళలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి పలుచోట్ల ప్లకార్డ్‌లతో ప్రదర్శనలు, కేక్‌కటింగ్‌లు, మహిళల భద్రత కోసం పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధానంగా మహిళలు, విద్యార్థినుల భద్రతను దృషిలో ఉంచుకుని అందుబాటులోకి తీసుకచ్చిన కార్యక్రమాలు, వివిధరకాల యాప్‌లపై అవగాహన కల్పించారు.

మహిళల ఆర్థిక సామాజికాభివృద్ధికి పెద్దపీట

కుటుంబానికి చుక్కానిలా ఉంటున్నది మహిళలే
వారి సేవలకు కొలమానాలు లేవు
గత 21 నెలల్లో రాష్ట్ర మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు
క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకల్లో సిఎం జగన్

అమరావతి,మార్చి8(ఆర్ఎన్ఎ): మహిళ అంటే ఆకాశంలో సగభాగమని.. ఆర్థిక, సామాజిక, రాజకీయంగా మహిళలకు హక్కులు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్.. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబానికి చుక్కానిలా ఉండి అందిస్తున్న సేవలకు కొలమానాలు లేవన్నారు. గత 21 నెలల్లో రాష్ట్ర మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టాం. అమ్మఒడి, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, కాపు నేస్తం మహిళల పేరిట ఇళ్ల స్థలం, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్లు వంటి పథకాలు తెచ్చాం ప్రతి రంగంలోనూ మహిళలు అభివృద్ధి చెందాలి. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళల్లో 60 శాతం మాత్రమే అక్షరాస్యత ఉంది. ఇప్పటికీ 40 శాతం మంది మహిళలకు చదువు అందడం లేదు. చదువులకు పేదరికం అడ్డుకాకూడదనే అమ్మఒడి పథకం తీసుకొచ్చామని వివరించారు. రెండేళ్లలో రూ.13,220 కోట్లు అమ్మఒడి పథకం కింద ఇచ్చాం. ఐదేళ్లలో రూ.32,500 కోట్లను అమ్మఒడి కింద ఇస్తాం. వైఎస్సార్ చేయూత కింద రూ.4,604 కోట్లు ఇచ్చాం. ఇళ్ల స్థలాల ద్వారా మహిళలకు రూ.27వేల కోట్లు ఇచ్చాం. అమ్మఒడి, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత ద్వారానే 21 నెలల్లో రూ.80వేల కోట్లు అందించాం. మహిళా ఉద్యోగుల క్యాజువల్ లీవ్స్ 20 రోజులకు పెంచాం. 13 జిల్లాల్లో దిశ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశాం. మహిళలపై నేరాలకు సత్వర విచారణ చేస్తున్నామని' సీఎం జగన్ అన్నారు. గతంలో మహిళలను ఉద్దేశించి చంద్రబాబు దారుణంగా మాట్లాడారని.. కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా అని హేళన చేశారన్నారు. మన తల్లులు మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దారు కాబట్టే.. ఇప్పుడు మనం ఈ స్థాయిలో ఉన్నామని సీఎం పేర్కొన్నారు. మహిళ అంటే ఆకాశంలో సగ భాగం, సృష్టిలో సగ భాగం అంటారు.. అలాంటి మహిళలు, అక్క చెల్లెమ్మలకు సగభాగం ఇస్తున్నామా అనేది మనమంతా ఆలోచన చేయాలని సీఎం జగన్ అన్నారు.. మహిళలకు రాజకీయంగా, ఆర్థికంగా హక్కుల్లో సగ భాగం ఇస్తున్నామా అనేది గుండెలపై చేయి వేసుకుని ఆలోచించాలన్న ఆయన.. ప్రతి పనిలోనూ మహిళలే కనిపిస్తుంటారు.. దేశం గర్వించేలా ద్వాక్రా ఉద్యమంలో మహిళలు క్రియాశీలకంగా ఉంటారు.. ఇంటిని అన్ని విధాలా బాగుచేరచాలనే తాపత్రయం అక్క చెల్లెమ్మల్లో కనిపిస్తుందన్నారు. ప్రతి ఇంటిలోనూ మహిళలు మనల్ని ఉన్నతంగా ఉంచబట్టే ఈ స్థాయిలో ఉన్నామన్న ఆయన.. భూదేవంత సహనంతో ఇంటింటా మహిళా మూర్తులు అందిస్తోన్న సేవలకు ఆర్థికంగా ఎలాంటి కొలమానాలు లేవన్నారు.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు.. మహిళా మంత్రుల సమక్షంలో కేక్ కట్ చేసిన సీఎం జగన్. మహిళా హెల్ప్ డెస్క్ లను ప్రారంభించారు.. ఇవాళ్లి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు పనిచేయనున్నాయి.. ఇక, దిశ కియోస్క్ యంత్రాలను కూడా ప్రారంభిం చారు సీఎం.. ప్రత్యేకంగా రూపొందించిన 900 దిశ బైక్ లు అందుబాటులోకి వచ్చా యి.. పని చేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు నిరోధించేందుకు చట్టం ఉంది.. ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాల్లో వేధింపుల నిరోధానికి విచారణకు కమిటీ తప్పని సరిగా ఉండాలని చట్టం చెబుతోం దన్నారు.. సచివాలయంలోనే మహిళల వేధింపుల నివారణ కమిటీ లేదు.. తొలుత సచివాలయం నుంచే ఈ కమిటీ వేస్తామ న్నారు.. ప్రతి ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయంలో మహిళా కమిటీ తప్పక ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు సీఎం వైఎస్ జగన్. మహిళలను ఆర్థికంగా రాజకీయంగా, సామాజికంగా సాధికారత కల్పించేలా చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడించారు సీఎం వైఎస్ జగన్.. రేపటి తరం చిన్నారులకు సింహా భాగం పథకాలు ఇచ్చామన్న ఆయన.. తొలిసారిగా ఈ ఏడాది బ్జడెట్ లో జెండర్ బడ్జెట్ కాన్సెప్ట్ తీసుకువస్తున్నాం.. అక్కచెల్లెమ్మలకు తోడుగా ప్రభుత్వం ఉందని చెబుతూ జెండర్ బడ్జెట్ తీసుకువస్తున్నామని తెలిపారు.. అక్క చెల్లెలెమ్మలకు బ్జడెట్ లో ఎంత ఖర్చు చేస్తున్నామనే వివరాలను వచ్చే బ్జడెట్ లో ప్రవేశపెడుతున్నాం.. మహిళల కోసం ప్రభు త్వం ఏ పథకాల ద్వారా ఎంత మొత్తం ఖర్చుచేస్తున్నామనే వివరాల తో బ్జడెట్ ను ప్రవేశపెడతాం అన్నారు. రాష్ట్రంలో మహి ళల్లో అక్షరాస్యత 2011 జనాభా లెక్కల వివరాల ప్రకారం కేవలం 60 శాతం మాత్రమే ఉంది.. ఇప్పటికీ 40 శాతం మహి ళలు చదువులకు దూరంగా ఉన్నారని.. అన్ని అంశాల్లోనూ స్త్రీల పట్ల సమాజంలో ఉన్న వివక్ష ఇలాగే వదిలేస్తే సమాజం ఎటు పోతుందో ఆలోచన చేయాలన్నారు. అక్క చెల్లెలెమ్మల కోసం అనేక పథకాలు చేప ట్టాం.. చదువు రాని వారు ఉండకూడదని అమ్మ ఒడి పథకాన్ని తెచ్చామని వెల్లడించిన సీఎం.. ఆడపిల్లలు ఇంగ్లీష్ మీడియం చదువులు గొప్పగా చదవాలని పథకాలు చేపట్టినట్టు తెలిపారు. 44.50 లక్షల మంది తల్లుల ఖాతాల్లో 85 లక్షల మంది పిల్లలకు అమ్మఒడి తీసుకువచ్చాం.. ఏడాదికి రూ. 6500 కోట్లు చొప్పున రెండేళ్లుగా రూ. 13022 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. 5 ఏళ్లలో రూ. 32500 కోట్లు అక్క చెల్లెమ్మల చేతుల్లో పెట్టనున్నామని వెల్లడించారు. చట్టం చేసిన ప్రభుత్వం మనదేనని గర్వంగా చెబుతున్నా ... వారికి ఎవరైనా అన్యాయం చేస్తే బుద్ధి చెప్పేందుకు 18 దిశ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశాం.. ప్రతి జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఏర్పాటు చేసాం, కోర్టులు ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ తెలిపారు.. మహిళలపై నేరాలను 7.5 శాతం తగ్గించగలిగాం.. నేరాల దర్యాప్తుకు 100 నుంచి 53 రోజులకు తగ్గించామని ఈ సందర్భంగా వెల్లడించారు. మహిళలకు ఇంటివద్దకే వచ్చి అన్ని రకాల తోడుంటే సేవలను తీసుకువచ్చాం.. ఈ ఏడాది మహిళా దినోత్సవం కోసం మరిన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇకపై మహిళా ఉద్యోగులకు 15 సీఎల్ లను 20 రోజులకు పెంచుతూ ప్రకటన చేశాం.. చెల్లెమ్ మలకోసం బయో డీ గ్రేడబుల్ శానిటరీ న్యాప్ కిన్స్ ను తీసుకువస్తున్నాం.. 7-12 తరగతి చదువుతున్న చెల్లెలెమ్మలకు జూలై 1 నుంచి ఉచితంగా న్యాప్ కిన్స్ ఇస్తాం.. చేయూత కిరణా దుకాణాల్లో తక్కువ ధరకే న్యాప్ కిన్స్ అందిస్తామని తెలియజేశారు. ఆర్థిక నేరాలు, మోసాలు, ప్రైవసీకి భంగం కల్గించే సాఫ్ట్ వేర్లు, మాల్వేరు, వైరస్ లను గుర్తించి అప్రమత్తం చేస్తామన్నారు సీఎం.. ఇప్పటికే 50 కియాస్క్ లు కొనుగోలు చేసి దిశ పోలీసు స్టేషన్లుసహా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఉంచుతున్నాం.. ప్రతి పథకం, కార్యక్రమం లోనూ అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్నామన్నారు.

సఫాయి కర్మచారులను సన్మానించిన కలెక్టర్

మహిళల పురోబివృద్ధికి సిఎం జగన్ కృషి
కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం,మార్చి8(ఆర్ఎన్ఎ): మహిళా నాయకత్వం - కోవిడ్ - 19 ప్రపంచంలో సమాన భవిష్యత్ సాధన అంశంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో సఫాయి కర్మచారులు నారాయణమ్మ, నాగమణి, మంగమ్మలను జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు సన్మానించారు. మహిళా జిల్లా అధికారులను, అంగన్వాడీ వర్కర్లను, కోవిడ్ సమయంలో విశేషంగా సేవలందించిన పలువురిని సన్మానించిన కలెక్టర్.. జాయింట్ కలెక్టర్ ఏ.సిరి, డబ్ల్యూసీ చైర్ పర్సన్ నల్లాని రాజేశ్వరి, ఆర్డీటీ డైరెక్టర్ విశాల ఫెర్రర్, రెడ్స్ సంస్థ భానుజ, డివిఓ పార్వతి,హార్టికల్చర్ డిడి పద్మలత, ఒకరోజు కలెక్టర్ శ్రావణి, కిలిమాంజారో పర్వతాన్ని అధిరోహించిన రిత్విక శ్రీ, పలువురు జిల్లా అధికారులు, మహిళలను కలెక్టర్ సన్మానించారు. ఇదిలావుంటే సృష్టి మొదలు తన ఉనికి నేటికి ఉందంటే అది కేవలం మహిళా మూర్తుల తోనే అని, రేపటి జెనెరసన్ అనే మాట వింటున్నాం అంటే అది కేవలం స్త్రీకి ఉన్న గొప్ప వరం ద్వారానే అని అనంత ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి అన్నారు. అటువంటి గొప్ప స్త్రీ మన జీవితంలో ఒక అక్కగా, చెల్లిగా ,అమ్మగా, భార్యగా, కూతురుగా, స్నేహితురాలిగా ఇలా మన జీవితంలో అభిమానాలతో మన ఎదుగుదలలలో వాళ్ళు ఎప్పుడు కలిసే ఉండనే ఉంటారని, అసలు స్త్రీ లు లేని ప్రదేశాలు మోడువారిన వనాల మాదిరి ఉంటాయని అని అన్నారు. అంత గొప్ప ప్రాచుర్యం ఉన్న స్త్రీని మనమందరం కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు, అందుకోసం ప్రస్తుత సీఎం జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారని, మన జిల్లా పరిధిలో కూడా అవన్నీ చక్కగా పనిచేస్తున్నాయని ఆయన చెప్పుకొచ్చారు. పోలీస్ శాఖకు వారు మహిళల కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. ఇకపై బావిష్యత్ లో కూడా మహిళలు వారి రక్షణ,సంక్షేమం కోసం కూడా పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అన్నివిధాల సౌకర్యాలు కల్పించి వారు గౌరవ జీవితం పొందేలా సహకరిస్తానని మాటిచ్చారు. అంతే కాకుండా ఎన్నడూ లేనివిదంగా అనంతపురం నగరపాలక ఎన్నికల్లో భాగంగా పెద్ద ఎత్తున 27 మంది మహిళలకు కార్పొరేట్ సీట్లు కేటాయించి తాము ఎప్పుడు స్త్రీల వైపు నిలబడతామని అందుకు రాజకీయాలల్లో స్త్రీలకు కేటాయించిన సీట్లు నిదర్శనమని చెప్పారు. నిజానికి స్త్రీల స్వేచ్ఛకు, అభివృద్ధికి తోడ్పాటు పడటం రాజకీయ నాయకుడిగా గాక మనిషిగా కూడా అది నా బాధ్యత మనందరి బాధ్యత అని కూడా చెప్పి ఆయన వ్యక్తిత్వాన్ని , ఔన్నత్యాన్ని నియోజకవర్గ ప్రజల ముందు మరోసారి చాటుకున్నారు. దీనితో నియోజకవర్గ మహిళలు,ప్రజలు అనంతవెంకటరామిరెడ్డిని అభినందించారు.

పురుషులతో పోటీపడే సత్తా మహిళలది

అవకాశం ఇస్తే వారు అన్ని రంగాల్లో రాణిస్తారు
రాజ్‌భవన్ వేడుకల్లో గవర్నర్ సతీమణి సుప్రవ

విజయవాడ,మార్చి8(ఆర్ఎన్ఎ): పురుషులతో సమానంగా పోటీ పడగల సత్తా మగువలదని రాష్ట్ర ప్రథమ పౌరురాలు గౌవర్నర్ సతీమణి సుప్రవ హరిచందన్ అన్నారుతగిన అవకాశాలు లభిస్తే మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీ పడగలుగుతారని సుప్రవ హరిచందన్ అన్నారు. విజయవాడ రాజ్ భవన్ లో సోమవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశ అభివృద్ధిలో స్త్రీలకు సమానమైన పాత్ర ఉందని ప్రపంచానికి తెలియజేసే రోజుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం భావించవచ్చని ఈ సందర్భంగా సుప్రవ హరిచందన్ అన్నారు. ఈ

రోజు మహిళలందరికీ చాలా ముఖ్యమైన రోజని, దశాబ్దాలుగా సాగిన మహిళా ఉద్యమాల ఫలితంగా సాధించిన సమాన హక్కులను పరిరక్షించుకోవలసిన బాధ్యతను మనకు గుర్తు చేస్తుందన్నారు. ఈ సంతోషకరమైన క్షణాలను మీ అందరితో పంచుకోవడానికి తనకు అవకాశం లభించటం ముదావహమన్నారు. కార్యక్రమానికి రాజ్ భవన్ సంయిక్త కార్యదర్శి నాగమణి అధ్యక్షత వహించగా, ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులకు సుప్రవ హరిచందన్ బహుమతులు అందచేసారు. కేక్ కట్ చేసి రాజ్ భవన్ మహిళా ఉద్యోగులకు స్వయంగా అందించారు. రాష్ట్ర ప్రథమ పౌరురాలిని రాజ్ భవన్ మహిళా ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

-వారు లేనిదే ప్రపంచం లేదన్న విజయశాంతి

హైదరాబాద్,మార్చి8(ఆర్ఎన్ఎ): మహిళల ప్రాముఖ్యతను ఎన్నటికీ మరిచిపోవద్దని, వారు లేనిదే ప్రపంచం లేదని బీజేపీ నేత విజయశాంతి అన్నారు. గతంలో ఇంటికే పరిమితమైన మహిళలు ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో ముందు నిలుస్తున్నారని చెప్పారు. ఒకప్పుడు మాట్లాడదానికి వెనకడుగు వేసిన మహిళలు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ప్రతి అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ముషీరాబాద్ నియోజకవర్గంలోని కశిష్ ఫంక్షన్ హాల్‌లో అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం విజయశాంతి మాట్లాడుతూ కరోనా కట్టడి కోసం సేవలందించిన డాక్టర్లు, నర్సులు, ఆశా వర్కర్ల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు న్యాయం జరగడం లేదని తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు న్యాయం జరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

మండలి ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే విజయం : మంత్రి జగదీష్ రెడ్డి



నల్లగొండ, మార్చి 8: ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా మండలి ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే విజయమని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలికి జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా.. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మంత్రి మాట్లాడారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వామ్యులేనని ఆయన పేర్కొన్నారు.

వారి సహకారంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో ఉద్యోగుల శ్రమ స్పష్టంగా కనిపిస్తుందని ఆయన చెప్పారు. అటువంటి ఉద్యోగులు మండలి ఎన్నికల్లో నూటికి నూరు శాతం టీఆర్ఎస్‌నే బలపరుస్తున్నారని, ఇందులో ఎటువంటి సందేహాలకు ఆస్కారం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పక్షాలు ఆడుతున్న అబద్ధాలకు ఆచార్య కోదండరామ్ వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. మోదీ పాలన రాక్షసత్వాన్ని మరిపిస్తోందని ఆయన విమర్శించారు.

బీజేపీ పాలనలో సామాన్యులకు ఆదాయం తగ్గిందని, అదే సమయంలో అంబానీ, ఆదానీల ఆదాయం మాత్రం రెట్టింపు అయిందంటూ ఆయన దెప్పి పొడిచారు. 700 శాతం ఆదాయం ఆదానిది పెరిగితే అంబానీది 370 శాతానికి పెరగడమే అందుకు నిదర్శనమన్నారు. వంట గ్యాస్ ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నా బీజేపీ పాలకుల్లో చలనం లేదని దుయ